ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి 11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 43 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట సోమవారం 20 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 43 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA MON 20 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## విశాఖ సదస్సుపై సీఎం చంద్రబాబు
# కొత్త వ్యూహం...

- నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు
- కేవలం ఒప్పందాలకే కాకుండా, విధానాల రూపకల్పనపై చర్చించాలని సీఎం ఆదేశం
- దావోస్ తరహాలో మేధోమథనానికి వేదికగా సదస్సు నిర్వహణ
- గూగుల్ రాకతో విశాఖ 'హ్యాపెనింగ్ సిటీ'గా మారిందని వ్యాఖ్య
- ఏపీ టూ ఏఐ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచన
- సదస్సులో ఏపీ వనరులు, అవకాశాలపై ప్రత్యేక ప్రజంటేషన్




**పెన్ పవర్ డెస్క్:**విశాఖపట్నం వేదికగా నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సును సరికొత్త పంథాలో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సదస్సు కేవలం పెట్టుబడుల ఒప్పందాల (ఎంఓయూ)కే పరిమితం కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే విధానాల రూపకల్పనపై విస్తృత మేధోమథనానికి వేదిక కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ ప్రఖ్యాత దావోస్ సదస్సు తరహాలో ఇక్కడ కూడా పెట్టుబడిదారులు, విధానకర్తల మధ్య ఫలవంతమైన చర్చలు జరగాలని స్పష్టం చేశారు. ఆదివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఉన్నతాధికారులు, ఈడీబీ అధికారులతో కలిసి సదస్సు నిర్వహణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "సానుకూల పారిశ్రామిక విధానాలు ఉన్నప్పుడే వాణిజ్యం, పరిశ్రమలు పెట్టుబడులతో ముందుకు వస్తాయి. అప్పుడే రాష్ట్రంలో సంపద సృష్టి సాధ్యమవుతుంది. విశాఖ సదస్సును కేవలం పెట్టుబడులు ఆకర్షించే కార్యక్రమంగా చూడవద్దు. ఇది విజ్ఞానాన్ని పంచుకునే, భవిష్యత్ ప్రణాళికలను చర్చించుకునే ఒక మేధోమథన వేదికగా నిలవాలి" అని అన్నారు. ప్లీనరీ, బ్రేక్‌అవుట్ సెషన్ల ద్వారా వివిధ రంగాలపై లోతైన చర్చలు జరిగితే పరిశ్రమలకు, ప్రభుత్వానికి, అంతిమంగా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఏపీ టూ ఏఐ నినాదంతో ముందుకు**

రాష్ట్రంలో ఇటీవల గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో డేటా ఏఐ హబ్ ఏర్పాటు

వివరాలు 2లో..

## దీపం జ్యోతిః పరంబ్రహ్మ.. దీపం సర్వతమోపహమ్..
### దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం చంద్రబాబు



- అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి... సీఎం చంద్రబాబు ఆకాంక్ష
- రాష్ట్రం ప్రగతి పథంలో ప్రకాశించాలని ఆశాభావం
- నరకాసుర వధకు ప్రతీకగా పండుగ ప్రాశస్త్యాన్ని గుర్తు చేసిన సీఎం

**పెన్ పవర్ డెస్క్:**దీపావళి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి

వివరాలు 2లో..



## ఏపీకి గూగుల్ సిటీ రావడం వెనుక కేంద్రం సహకారం ఉంది

- ఆ ఒక్క ఫోన్ కాల్‌తోనే ఏపీకి గూగుల్: అసలు విషయం చెప్పిన మంత్రి నారా లోకేశ్
- ఆస్ట్రేలియాలో నారా లోకేశ్ పర్యటన
- సిడ్నీలో తెలుగు డయాస్పోరాతో సమావేశం
- ప్రధాని జోక్యంతో గూగుల్ కోసం చట్ట సవరణ
- పవన్‌తో కలిసి 15 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించడమే లక్ష్యం అంటూ వ్యాఖ్యలు
- గూగుల్ ఎంత ముఖ్యమో.. ఎంఎస్ఎంఈలు కూడా అంతే ముఖ్యమని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రానికి 'గూగుల్ ఏఐ డేటా సెంటర్' రావడం వెనుక కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని, సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యంతోనే ఇది సాధ్యమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తాను గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు రావాలని కోరినప్పుడు, కేంద్ర చట్టాల్లో కొన్ని సవరణలు అవసరమని వారు చెప్పారని గుర్తుచేశారు. ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్ ద్వారా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన

వివరాలు 2లో..



## సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు. దీపావళి పండుగ సందర్భంగా సోమవారం పత్రికకు సెలవు. మంగళవారం పునః ప్రారంభం.

## నన్ను జైలుకు పంపాలన్నదే చంద్రబాబు లక్ష్యం

- నకిలీ మద్యం కేసులో ఏ విచారణకైనా సిద్ధమన్న జోగి రమేశ్
- లై డిటెక్టర్ పరీక్షకు కూడా తాను సిద్ధమని ప్రభుత్వానికి సవాల్
- తనను జైలుకు పంపడమే లక్ష్యంగా ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపణ
- ఇదంతా చంద్రబాబు ఆడుతున్న దృష్టి మళ్లించే రాజకీయమంటూ విమర్శ
- నిందితుడు జనార్దన్ కస్టడీ వీడియో బయటకు ఎలా వచ్చిందని సూటి ప్రశ్న
- జయచంద్రారెడ్డికి మద్యం వ్యాపారం ఉందని తెలిసి టికెట్ ఎలా ఇచ్చారని నిలదీత

వివరాలు 2లో..




## తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు...
# వారితో మాత్రం జాగ్రత్త!



- 'నయా నరకాసురుల'ను ప్రజలు ఓడించారంటూ పవన్ కీలక వ్యాఖ్యలు
- ఓటమి అక్కసుతో కొందరు ప్రజల మధ్య చిచ్చు పెట్టే యత్నం చేస్తున్నారని ఆరోపణ
- అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- మహిళలు సత్యభామ స్ఫూర్తిని అందుకోవాలని సూచన
- పర్యావరణహితంగా, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని విజ్ఞప్తి

**పెన్ పవర్ డెస్క్:**దీపావళి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజే శారు. ఈ సందర్భంగా ఆయన పరోక్షంగా రాజకీయ ప్రత్యర్థులపై ఆసక్తికర

వివరాలు 2లో..

## ఆ సబ్‌మెరైన్ చేరి ఉంటే 25,000 మంది చనిపోయేవారు.. ట్రంప్ సంచలన ప్రకటన



- అమెరికా తీరం వైపు వస్తున్న మాదకద్రవ్యాల సెమీ-సబ్‌మెర్సిబుల్‌పై యూఎస్ సైన్యం దాడి
- దాడిలో ఇద్దరు డ్రగ్స్ స్మగ్లర్లు మృతి, ప్రాణాలతో బయటపడిన మరో ఇద్దరి అరెస్ట్
- నౌకలో ప్రాణాంతక ఫెంటానిల్‌తో పాటు భారీగా ఇతర మత్తుపదార్థాలు ఉన్నట్లు వెల్లడి
- డ్రగ్స్ కార్టెల్స్‌ను 'టెర్రరిస్టులు'గా అభివర్ణించిన ట్రంప్

వివరాలు 2లో..

## ఆస్ట్రేలియా కంపెనీలకు లోకేశ్ ఆహ్వానం..
# ఏపీలో పెట్టుబడులే లక్ష్యం!


- సిడ్నీలో ఆస్ట్రేలియా-ఇండియా సీఈవో ఫోరం డైరెక్టర్‌తో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీని తమ స్టేట్ ఎంగేజ్‌మెంట్ అజెండాలో చేర్చాలని ఫోరమ్‌కు విజ్ఞప్తి
- రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని ఆస్ట్రేలియా కంపెనీలకు పిలుపు
- కృష్ణపట్నం, విశాఖ, అనంతపురం క్లస్టర్లలో పెట్టుబడులకు ఆహ్వానం
- నవంబర్‌లో జరిగే విశాఖ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని విజ్ఞప్తి
- ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తున్నామని తెలిపిన ఫోరం డైరెక్టర్



వివరాలు 2లో..

## యుద్ధం ఆపేయాలంటే డొనెట్స్క్ ప్రాంతాన్ని అప్పగించాలి

- డొనెట్స్క్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించాలన్న పుతిన్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో శాంతి చర్చల్లో వెల్లడి
- జపొరిజియా, ఖేర్సన్ ప్రాంతాలను తిరిగిచ్చేస్తామన్న రష్యా అధ్యక్షుడు



**పెన్ పవర్ డెస్క్:**ఉక్రెయిన్ తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపేయాలంటే డొనెట్స్క్ ప్రాంతాన్ని తమకు అప్పగించాలని రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు వివరించినట్లు తెలుస్తోంది. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ మధ్యవర్తిత్వం చేస్తున్న విషయం తెలిసిందే. శాంతి చర్చల్లో భాగంగా ఇరు దేశాధినేతలతో ట్రంప్ పలుమార్లు భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ కు ట్రంప్ ఇటీవల ఫోన్ చేయగా.. డొనెట్స్క్ తమకు అప్పగించాలని పుతిన్ డిమాండ్

వివరాలు 2లో..

## 25 నుంచి కవిత 'జాగృతి జనం బాట'.. శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు


- కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న తెలంగాణ జాగృతి
- నాలుగు నెలల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- భర్తతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కవిత
- కార్యక్రమం విజయవంతం కావాలని స్వామివారికి పూజలు

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత త్వరలో ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 'జాగృతి జనం బాట' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ

వివరాలు 2లో..



## దీపావళి వేళ పారిశ్రామిక రంగానికి తియ్యని కబురు చెప్పిన సీఎం చంద్రబాబు



- పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం దీపావళి కానుక
- పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాల కింద తొలి విడత నిధులు
- రూ. 1,500 కోట్లు విడుదల చేస్తున్నట్టు సీఎం ప్రకటన
- ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ పరిశ్రమలకు అండగా ఉంటామని స్పష్టీకరణ
- పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేస్తామన్న చంద్రబాబు

**పెన్ పవర్ డెస్క్:**దీపావళి పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామిక రంగా నికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పరిశ్రమలకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలకు సంబంధించి తొలి విడతగా రూ. 1,500 కోట్లను విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పండుగ చీకటిపై వెలుగు సాధించే విజయానికి ప్రతీక అని, ఈ స్ఫూర్తితోనే పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నామని ఆయన తెలిపారు. ఆర్థికంగా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# సామాన్యుల వెతలు: ఆ తప్పులే జరుగుతున్నాయా ..!

వైసీపీ పాలనలో జరిగిన తప్పులు సరిచేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అప్పటి తప్పులు ఇప్పుడు జరగకుండా చూస్తున్నామని వ్యాఖ్యానిస్తోంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు పదే పదే చెబుతున్నా రు. అంతేకాదు.. గత తప్పులు పునరావృతం కాకుండా కూడా చూస్తున్నామని అంటున్నారు. కానీ, ఏమాట కు ఆమాట చెప్పాల్సి వస్తే.. గత తప్పులే ఇప్పుడు కూడా జరుగుతున్నాయన్నది సామాన్యులు చెబుతు న్న మాట. ప్రజల నుంచి అనేక విషయాల్లో ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న సర్కారుకు ఈ వ్యవహారం బోధపడాల్సిన అవసరం ఉంది.

**ప్రధానంగా మూడు విషయాల్లో ప్రజలు ముఖ్యంగా సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

**1) పోలీసులు అందుబాటులో ఉండకపోవడం:** సాధారణంగానే పోలీసులు సామాన్యులకు అందుబాటులో ఉండరు. ఇది గత ప్రభుత్వంలోనూ తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇక, ఇప్పుడు సిట్‌ల పేరుతో ప్రతి విషయంలోనూ ప్రత్యక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సాధారణ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పోలీసులకు సమయం చిక్కడం లేదు. దీంతో స్టేషన్లకు వెళ్లిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది

**2) సామాన్యులకు ప్రభుత్వ బాసట:** గతంలో వలంటీర్ వ్యవస్థ ఉన్నప్పుడు ప్రజలకు ఏ చిన్న అవసరం ఏర్పడినా.. వారు తమ సమస్యలను వలంటీర్లకు చెప్పుకొనేవారు. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వం తమతో నే ఉందన్న బావన ఉంది. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎమ్మెల్యేల కార్యాలయాలకు వెళ్తున్నా.. వారికి ఊరట లభించడం లేదు. పనులు కావడమూ లేదు. ఈ పరిస్థితిపై మానిటరింగ్ చేసేవారు కూడా కరువ య్యారు. దీంతో సామాన్యులు తమ సమస్యలు చెప్పుకొనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**3) ప్రతి పనికీ..:** ఔను! ఇది వాస్తవం. టీడీపీ సానుభూతిపరులు కూడా చేస్తున్న వ్యాఖ్య. ప్రతి పనికీ చేతు లు తడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏ చిన్న పనికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినా.. ఏ చిన్న వ్యా పారం ప్రారంభించినా.. చేతులు తడపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నది టీడీపీ నాయకులే చెబుతున్నారు. ఈ పరిస్థితిని సీఎం చంద్రబాబు సమీక్షించాలి. పరిస్థితిని చక్కదిద్దాలి. లేకపోతే.. మార్పు మాట ఏమో కానీ.. ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితి మాత్రం ఉండదని అంటున్నారు పరిశీలకులు. ఆ దిశగా సర్కారు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

# విశాఖ సదస్సుపై సీఎం చంద్రబాబు కొత్త వ్యూహం...

- మొదటి పేజీ తరువాయి

చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమని చంద్రబాబు పేర్కొన్నారు. "గూగుల్ రాకతో విశాఖ నగరం ఒక హ్యాపెనింగ్ సిటీగా మారింది. ఈ స్ఫూర్తితో రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి చిరునామాగా మార్చాలి. 'వన్ ఫ్యామిలీ వన్ ఏఐ' తరహాలో 'ఏపీ టూ ఏఐ' నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని అధికారులకు సూచించారు. ఈ సదస్సులో ఏఐ ఫర్ గుడ్, సెమీ కండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత, డ్రోన్లు, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ తరహా అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆదేశించారు. వీటితో పాటు లాజిస్టిక్స్ రంగంలో రహదారులు, అంతర్గత జలరవాణా, కోల్డ్ స్టోరేజీలు, అగ్రిటెక్, రేర్ ఎర్త్ మినరల్స్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలను కూడా చర్చనీయాంశాలుగా చేర్చాలని స్పష్టం చేశారు. సదస్సుకు దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, ప్రముఖ విద్యాసంస్థల ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సదస్సును ఒక అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంగా ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. సదస్సులో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులు, పెట్టుబడి అవకాశాలను వివరిస్తూ ప్రత్యేక ప్రజంటేషన్ సిద్ధం చేయాలని, 21వ శతాబ్దం భారత్‌దే అనే స్ఫూర్తిని అది ప్రతిబింబించేలా ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల కోసం హోం స్టే వసతి కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించడం గమనార్హం.

# నన్ను జైలుకు పంపాలన్నదే చంద్రబాబు లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలపై వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కేసులో తన పేరును ఇరికిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కేసులో తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకు కూడా వస్తానని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తనను అన్యాయంగా జైలుకు పంపాలనే ఏకైక లక్ష్యంతోనే ఈ కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. మీడియాతో మాట్లాడిన జోగి రమేశ్, ప్రభుత్వంపై పలు సూటి ప్రశ్నలు సంధించారు. "నకిలీ మద్యం కేసులో నన్ను ఇరికించాలని చూస్తున్నారు. నేను ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నాను. మీరు చెప్పిన చోటికి లై డిటెక్టర్ పరీక్షకు కూడా వస్తాను. కానీ, ఈ కేసులో మీరు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలా ఉన్నాయి" అని అన్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌ను ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేసి పిలిపించి, అతనితో బలవంతంగా తన పేరు చెప్పించిందని ఆరోపించారు. అసలు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడి వీడియో బయటకు ఎలా లీక్ అయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జనార్దన్, జయచంద్రారెడ్డి స్నేహితులని స్వయంగా చంద్రబాబే గతంలో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మద్యం వ్యాపారంతో సంబంధం ఉన్న వ్యక్తికి టీడీపీ టికెట్ ఎలా ఇచ్చిందని జోగి రమేశ్ నిలదీశారు. "తంబళ్లపల్లె నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డికి మద్యం వ్యాపారం ఉందని మీకు తెలియదా? తెలిసీ అతనికి టికెట్ ఎలా ఇచ్చారు? దీని వెనుక ఎలాంటి సూట్‌కేస్ ఒప్పందాలు జరిగాయి?" అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో నిజాయతీ ఉంటే చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మంచి నీటి కుళాయిల కంటే బెల్టు షాపులే ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ మద్యం పాలసీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. ఈ కేసులో తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి తాను ఎక్కడైనా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని

జోగి రమేశ్ స్పష్టం చేశారు. "నేను తిరుమల వెంకన్న లేదా బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ప్రమాణం చేస్తాను. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటికి వచ్చి అయినా ప్రమాణం చేయడానికి సిద్ధం. నాపై బురద జల్లాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని దుర్మార్గమైన రాజకీయాలు చేయడం మానుకోవాలి" అని హితవు పలికారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించలేకపోతే చంద్రబాబు, లోకేశ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆ సబ్‌మెరైన్ చేరి ఉంటే 25,000 మంది చనిపోయేవారు.. ట్రంప్ సంచలన ప్రకటన

కరేబియన్ సముద్రంలో కలకలం రేగింది. అమెరికా తీరం వైపు భారీగా మాదకద్రవ్యాలతో వస్తున్న ఓ సెమీ-సబ్‌మెర్సిబుల్ నౌకను అమెరికా సైన్యం బాంబులతో పేల్చివేసింది. అంతర్జాతీయ డ్రగ్స్ రవాణాకు కీలక మార్గంగా ఉన్న ఈ ప్రాంతంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఇద్దరు స్మగ్లర్లు అక్కడికక్కడే మరణించారు. ఈ దాడి ద్వారా సుమారు 25,000 మంది అమెరికన్ల ప్రాణాలను కాపాడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.

**ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ప్రకటన**

ఈ ఘటనపై తన అధికారిక సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ స్పందించారు. "అమెరికాలోకి ప్రాణాంతకమైన ఫెంటానిల్, ఇతర మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్న భారీ సబ్‌మెరైన్‌ను మన సైన్యం విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ నాకు ఎంతో గర్వకారణం. ఒకవేళ ఈ నౌక మన తీరానికి చేరి ఉంటే దాదాపు 25,000 మంది అమాయక అమెరికన్లు ప్రాణాలు కోల్పోయేవారు. ఈ దాడిలో ఇద్దరు టెర్రరిస్టులు హతమయ్యారు" అని ఆయన పేర్కొన్నారు.

**వీడియో విడుదల చేసిన పెంటగాన్**

ఈ దాడికి సంబంధించిన దృశ్యాలను అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ ఎక్స్‌లో విడుదల చేసింది. ఆ వీడియోలో, సముద్ర జలాల్లో వేగంగా ప్రయాణిస్తున్న సెమీ-సబ్‌మెర్సిబుల్‌పై అమెరికా హెలికాప్టర్ల నుంచి బాంబులు వర్షంలా కురవడం, అనంతరం అది పేలిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. గురువారం జరిగిన ఈ ఆపరేషన్ తర్వాత, నౌక శకలాల నుంచి ప్రాణాలతో బయటపడిన ఇద్దరిని యూఎస్ దళాలు రక్షించి, తమ యుద్ధనౌకకు తరలించాయి. పట్టుబడిన వారిలో ఒకరు ఈక్వెడార్, మరొకరు కొలంబియా దేశస్థులని అధికారులు ధ్రువీకరించారు. వారిని విచారణ నిమిత్తం స్వదేశాలకు పంపిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

**కార్టెల్స్‌పై యుద్ధమే..**

గత ఏడాది సెప్టెంబర్ నుంచి కరేబియన్ ప్రాంతంలో అమెరికా ఇలాంటి ఆపరేషన్లు చేపట్టడం ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఈ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 29 మంది డ్రగ్ స్మగ్లర్లు మరణించారు.

మెక్సికన్ డ్రగ్స్ కార్టెల్స్‌పై తమది కేవలం నిఘా మాత్రమే కాదని, ఇదొక "సాయుధ పోరాటం" అని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. 9/11 ఉగ్రదాడుల అనంతరం టెర్రరిజంపై యుద్ధం కోసం రూపొందించిన చట్టపరమైన అధికారాలనే ఇప్పుడు ఈ డ్రగ్స్ కార్టెల్స్‌పై ప్రయోగిస్తుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. "సముద్ర, భూ మార్గాల ద్వారా మా దేశంలోకి విషాన్ని పంపాలని చూసే మాదకద్రవ్యాల టెర్రరిస్టులను అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు" అని ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు.

## తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు...

# వారితో మాత్రం జాగ్రత్త!

- మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలు చేశారు. 'నయా నరకాసురులను' ప్రజలు ప్రజాస్వామ్య యుద్ధంలో ఓడించారని, అయితే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగు ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు! దీప కాంతులతో శోభాయమానంగా... సంప్రదాయబద్ధంగా నిర్వహించుకొనే పండుగ దీపావళి. తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు. మన భారతదేశంలో చేసుకొనే ప్రతీ పండుగకీ ఒక పరమార్థం ఉంది. మనకు జీవన శైలిని నేర్పుతుంది. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటాం. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలందరూ కలసి ఓడించారు. ఈ నరకాసురులు మారీచుల్లాంటివారు. రూపాలు మార్చుకొంటూ వస్తారు. తమను ఓడించారనే అక్కసుతో.. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, అశాంతి రేకెత్తించే కుట్రలకు దిగుతున్నారు. కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండి.. ఇలాంటి నయా నరకాసురులకు, వారి అనుచర గణానికి ఎప్పటికప్పుడు గుణపాఠం చెప్పాలి. ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. ఈ వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# యుద్ధం ఆపేయాలంటే డొనెట్స్క్ ప్రాంతాన్ని అప్పగించాలి

- మొదటి పేజీ తరువాయి

చేశారని సమాచారం. ఉక్రెయిన్ కు చెందిన జపరోజియా, ఖేర్సన్ ప్రాంతాలను రష్యా బలగాలు ఇప్పటికే ఆక్రమించుకున్నాయి. ఈ భూభాగాలను తిరిగిచ్చేస్తామని పుతిన్ ఆఫర్ చేసినట్లు వైట్ హౌస్ వర్గాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనం ప్రచురించింది. అయితే, ఈ కథనంపై ఇంతవరకు అటు క్రెమ్లిన్ కానీ ఇటు వైట్‌హౌస్ కానీ స్పందించలేదు.

# ఆస్ట్రేలియా కంపెనీలకు లోకేశ్ ఆహ్వానం.. ఏపీలో పెట్టుబడులే లక్ష్యం!

ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద ఎత్తున ఆస్ట్రేలియా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సిడ్నీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆస్ట్రేలియా-ఇండియా సీఈవో ఫోరం డైరెక్టర్ జోడి మెక్ కేతో కీలక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలను ఆయన ఆహ్వానించారు.

ఈ భేటీలో కీలక పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతున్న ఆంధ్రప్రదేశ్‌ను తమ స్టేట్ ఎంగేజ్‌మెంట్ అజెండాలో చేర్చాలని లోకేశ్ ఫోరమ్‌ను కోరారు. ఏపీఈడీబీ, సీఐఐ, బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా కలిసి నిర్వహించనున్న 'ఆస్ట్రేలియా-ఏపీ సీఈవో రౌండ్ టేబుల్' సమావేశానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఇంధనం, ఓడరేవులు, లాజిస్టిక్స్, డిజిటల్ వంటి కీలక రంగాల్లో ఉన్న అవకాశాలను ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ సీఈవోలకు వివరించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా కృష్ణపట్నం, విశాఖపట్నం, అనంతపురం ఇండస్ట్రియల్ క్లస్టర్లలో ఆస్ట్రేలియన్ కంపెనీలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని కోరారు.

ఇదే క్రమంలో నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్%-%2025కు ఫోరం నాయకత్వ బృందంతో సహా హాజరు కావాల్సిందిగా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ఆహ్వానించారు. తదుపరి సీఈవోల ఫోరం సెషన్‌లో ఏపీకి భాగస్వామ్యం కల్పించాలని, ఆ సమావేశంలో రాష్ట్రంలోని ప్రాధాన్యత రంగాలను ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు. లోకేశ్ విజ్ఞప్తిపై స్పందించిన మెక్ కే ఫోరం కార్యకలాపాలను వివరించారు. ఇరు దేశాల ప్రధానుల చొరవతో 2012లో ఈ ఫోరం ప్రారంభమైందని, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడమే దీని లక్ష్యమని ఆమె తెలిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. సుమారు 48.4 బిలియన్ డాలర్ల వాణిజ్య భాగస్వామ్యానికి తమ ఫోరం మద్దతు ఇస్తోందని, విధానపరమైన సహకారం కోసం సీఐఐతో కలిసి పనిచేస్తున్నామని ఆమె వివరించారు.

# దీపావళి వేళ పారిశ్రామిక రంగానికి తియ్యని కబురు చెప్పిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, పారిశ్రామిక రంగానికి అండగా నిలబడాలన్న తమ నిబద్ధతలో వెనకడుగు వేసేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని బలోపేతం చేసి, రాష్ట్రాన్ని వ్యాపారానికి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "ఆశావహ దృక్పథమే పురోభివృద్ధికి చోదకశక్తి. ఈ నమ్మకంతోనే ఉజ్వల భవిష్యత్తు వైపు రాష్ట్రాన్ని నడిపించే మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉంటాం" అని పేర్కొన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయగలమని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది. తాజా నిర్ణయంతో పారిశ్రామిక వర్గాల్లో నూతనోత్సాహం నెలకొంది.

# దీపం జ్యోతిః పరంబ్రహ్మ.. దీపం సర్వతమోపహమ్..

## దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త కాంతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, లోకకంటకుడైన నరకాసురుడిని శ్రీకృష్ణుడు, సత్యభామ సంహరించిన రోజుగా దీపావళికి ఎంతో ప్రాశస్త్యం ఉందని గుర్తుచేశారు. అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే పవిత్రమైన రోజు ఇదని ఆయన అభివర్ణించారు. "దీపం జ్యోతిః పరంబ్రహ్మ... దీపం సర్వతమోపహమ్ దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమోస్తుతే" అంటూ దీపం యొక్క ప్రాముఖ్యతను శ్లోకం ద్వారా ఉదహరించారు. ఈ దీపావళి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సంతోషం, సౌభాగ్యాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, ప్రగతి పథంలో ప్రకాశించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీకి గూగుల్ సిటీ రావడం వెనుక కేంద్రం సహకారం ఉంది

- మొదటి పేజీ తరువాయి

వెంటనే స్పందించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడి ఆ చట్టాలను సవరించేలా చేశారని లోకేశ్ వివరించారు. ఈ కేంద్ర ప్రభుత్వ చొరవతోనే గూగుల్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఏపీకి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ప్రాంగణంలోని బ్రూవర్స్ పెవిలియన్ నోబుల్ డైనింగ్ రూమ్‌లో ఏపీఎన్‌ఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన ఆస్ట్రేలియా తెలుగు డయాస్పోరా సమావేశానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక విషయాలను పంచుకున్నారు.

**కేంద్ర సహకారంతోనే రాష్ట్ర ప్రగతి**

కేవలం గూగుల్ మాత్రమే కాకుండా, కొప్పర్తి నోడ్, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, ఎన్టీపీసీ గ్రీన్ ప్రాజెక్ట్, నక్కపల్లి ఫార్మాసిటీ వంటి అనేక కీలక ప్రాజెక్టులు కూడా కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతోనే రాష్ట్రంలో రూపుదిద్దుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆర్సెల్లర్ మిట్టల్ ప్రాజెక్ట్ విషయంలోనూ కేంద్రం ఇలాగే సహకరించిందని, ఒక్క జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను అనకాపల్లికి తీసుకురాగలిగామని అన్నారు. తనకు గూగుల్ వంటి పెద్ద సంస్థలు ఎంత ముఖ్యమో, మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కూడా అంతే ముఖ్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

**పవన్‌తో కలిసి 15 ఏళ్ల ప్రయాణం**

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో తమ పొత్తు ఎంతో స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. పొత్తుల్లో చిన్న చిన్న సమస్యలు సహజమే అయినా, రాబోయే 15 ఏళ్ల పాటు కలిసికట్టుగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్నదే తమ ఉమ్మడి లక్ష్యమని పవన్ పదేపదే చెబుతున్నారని గుర్తుచేశారు. గత ఐదేళ్ల పాలనలో పీపీఏలు, ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల రాష్ట్రం, దేశం తీవ్రంగా నష్టపోయాయని, ఆ చేదు అనుభవం పునరావృతం కాకుండా చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని నంబర్ 1 స్థానంలో నిలపడమే తమ ఏకైక అజెండా అని, తెలుగువారు మళ్లీ గర్వంగా తలెత్తుకునే రోజులు తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రవాసాంధ్రులే మన బ్రాండ్ అంబాసిడర్లు**

విదేశాల్లో స్థిరపడిన తెలుగువారంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "మీరు మీ కంపెనీలలో రాష్ట్రం గురించి మాట్లాడితే, నా కన్నా మార్కెటింగ్ సులభంగా జరుగుతుంది. ఏదైనా కంపెనీ భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే మా దృష్టికి తీసుకురండి, ఆ డీల్ పూర్తి చేసే బాధ్యత మేం తీసుకుంటాం" అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని, ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రవాసాంధ్రుల పెట్టుబడులకు మద్దతుగా ఏపీఎన్‌ఆర్‌టీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, దానిని ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ఉన్న తెలుగువారికి, ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు ఏపీఎన్‌ఆర్‌టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని లోకేశ్ తెలిపారు. అనంతరం ప్రవాసాంధ్రులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడ్నీలోని భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ ఎస్. జానకీ రామన్, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ వేమూరి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 25 నుంచి కవిత 'జాగృతి జనం బాట'.. శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు

- మొదటి పేజీ తరువాయి

ఆమె తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

ఈ నెల 25వ తేదీ నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కవిత వెల్లడించారు. ఈ కార్యక్రమం సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే, కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి కావాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తన భర్త అనిల్‌తో కలిసి తిరుమల చేరుకున్న కవిత, వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న కవిత దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# రూ.28లక్షల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు, ఎల్.వో.సీలు అందచేసిన మాజీ మంత్రి ప్రత్తిపాటి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 19:**
ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల్ని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి ఆదివారం స్వయంగా లబ్ధిదారులకు అందచేశారు. 34 మంది లబ్ధిదారులకు రూ. 25.31 లక్షల విలువైన చెక్కుల్ని, మరో ఇద్దరికి రూ. 2.30 లక్షల విలువైన ఎల్.వో.సీలను అందచేసిన ప్రత్తిపాటి.. వారి సమస్యలు తెలుసుకున్నారు. కూటమిప్రభుత్వం పేదల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందని, రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం త్వరలోనే సంజీవని పథకం అమల్లోకి తీసుకురానుందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, ప్రధాన



కార్యదర్శి మాద్దుమల రవి, మురకొండ మల్లిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

పెన్ పవర్

గుంటూరు । బాపట్ల । పల్నాడు

# లేట్ అయిన లేటెస్ట్ గా ఇచ్చిన ఉద్యోగస్తులకు దీపావళికి ఆనందం ఎనలేనిగా ఉంది.. రాచకొండ లక్ష్మయ్య..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19.**
ఆంధ్రప్రదేశ్ ప్రజలకి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగస్తులకు ప్రజలకు శుభాకాంక్షలు ఆనందంగా పండగ జరుపుకోవాలని ఉద్యోగస్తులకు ఒక డిఏ ఇవ్వటం జరిగింది. లేట్ అయిన లేటెస్ట్ గా ఇచ్చిన ఉద్యోగస్తులకు దీపావళి కి ఆనందం ఎనలేని గా ఉంది. గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల్లో ఏ రోజు ఉద్యోగ సంఘ నాయకులను పిలిచి మాట్లాడిన దాఖలాలు లేవు, ఉద్యోగ సంఘాల నాయకులు మొరపెట్టుకున్నా కూడా దగ్గరకు కూడా రాని లేదు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంకా ఎద్దేమో మాటలు మాట్లాడారు మాజీ మంత్రి బొచ్చ సత్యనారాయణ సకల మంత్రి రామకృష్ణారెడ్డి కానీ ఈరోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగ సంఘాల నాయకులను పిలిచి ప్రశాంతంగా వారి సమస్యలు తెలుసుకొని వారికి ఏమి ఇయ్యాల ఏంటి అనేది ఆలోచన చేసి వారిని కూర్చోబెట్టి మాట్లాడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి కానుక ఒక డి ఏ ఇవ్వడం జరిగింది దమ్మున్న నాయకుడికి దమ్ము లేని అసమర్ధ నాయకుడికి తేడా తెలుసుకున్నారు తెలుసుకొని ప్రజలు ఉద్యోగస్తులు కలిసి 11 సీట్లు ఇచ్చారు ఉద్యోగ సంఘ నాయకుడు వెంకటరామిరెడ్డి ఎక్కడుండావ్ కుల పిచ్చి తో మాట్లాడుతున్నావ్ జాగ్రత్త మీ నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్క డీ ఏ కూడా తెచ్చుకోవడం చేతకాలా నువ్వు దాచుకున్న డబ్బులు కూడా దోచుకున్నాడు తెలుసుకో వెంకటరామిరెడ్డి మూర్ఖంగా అహంకారంగా మాట్లాడటం కాదు, ఈరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


**దీపావళి కానుక**

ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డిఎ సహా పలు ఆర్థిక ఆర్థికేతర ప్రయోజనాలు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి కానుక. వారికి ఎంత చేసినా చివర్లో ఒకటి తక్కువ అయినా ఓటు వేయని వారికి ఆ ఒక్కటి కూడా అవసరమా అనుకునే వారు కొందరు ఉండొచ్చు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన నగదు లెక్కలు చూసి అమ్మో అనుకోవచ్చు. అన్ని ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టి ప్రభుత్వ ఉద్యోగానికి అంత డిమాండ్.. బాగా చదవాలి అనే కసి యువతలో ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు చిత్తశుద్ధి లేక అవినీతి ఎక్కువై జనంలో వ్యతిరేకత ఉండొచ్చు కానీ తప్పదు. వ్యవస్థ నడిచేది ఈ ప్రభుత్వ ఉద్యోగులతోనే! ఇపుడు కాకపోతే తర్వాత అయినా న్యాయం చేస్తారు అనే భరోసా మిగతా వర్గాల్లో కల్పించారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక సచివాలయ ఉద్యోగులపై చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు సాక్షి తప్పపట్టవచ్చు కానీ ఆ వ్యాఖ్యలు నిజం. ఎందుకో నిన్ననే రాశాను. అన్నా పెరుగన్నం తిన్నారా అని ఆరంభంలో అపార ప్రేమను ఒలకబోసిన మాజీ ముఖ్యమంత్రి జగనన్న ఆ తర్వాత ఉద్యోగస్తులకి చుక్కలు చూపించారు చంద్రబాబు నాయుడు ఆ తరహా కాకుండా స్వయంగా ఉద్యోగ నేతలతో చర్చల్లో పాల్గొనడం కొసమెరుపు. ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగా అని సాక్షి కథనంలో అభిప్రాయం వెల్లడించిన వారి పేర్లు చూస్తే వరుసగా చివర్లో రెడ్డి రెడ్డి రెడ్డి రెడ్డి అని ఉండటం గమనార్హం. ఈ కుల వ్యవహారాలే తగ్గించుకుంటే ఉద్యోగులకు వైకాపాకు మంచిదికాదని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అభిప్రాయపడ్డారు.

# వాసుకి క్షేత్రంలో విరాజిల్లే రాధా గోవిందులు

## దైవ లీలల సాక్ష్యాలు -నరసరావుపేట, బరంపేట శ్రీ రాధా గోవింద కృష్ణచంద్ర (ఇస్కాన్ టెంపుల్)







**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 19**
నరసరావుపేట పట్టణంలోని బరంపేట ప్రాంతంలో ఉన్న శ్రీ రాధా గోవింద కృష్ణచంద్ర దేవాలయం (ఇస్కాన్ టెంపుల్) కొన్ని రోజులుగా అద్భుతమైన దైవ లీలలకు సాక్ష్యమవుతోంది. ఆలయ పరిసర ప్రాంతంలో దేవత సర్పములు పర్యటించడం స్థానిక భక్తులలో భక్తి భావాన్ని మరింతగా పెంచింది. ఎక్కడినుండి వస్తున్నాయో తెలియదు, ఎలా మాయమైపోతున్నాయో తెలియదు : ఇవన్నీ దైవ సంకేతాలుగా భావిస్తున్నారు భక్తులు. ఇస్కాన్ ఆలయం ఉన్న ప్రదేశం చారిత్రకంగా వాసుకి క్షేత్రం గా ప్రసిద్ధి చెందింది. పురాణ కాలంలో ఈ ప్రాంతం పుట్ట కొలువైనటువంటి పావన స్థలంగా గుర్తించబడింది అని ఆదివారం నాడు ఆలయ బృందం తెలిపారు. అప్పట్లో ఇక్కడ రాధాకృష్ణ పూల తోట కూడా ఉండేది. ఇతిహాస ప్రకారం, శ్రీ చైతన్య మహాప్రభు 1525 సంవత్సరంలో శ్రీశైలం యాత్ర సందర్భంగా పూరీ జగన్నాథ మందిరం నుండి బయలుదేరి, ఈ వాసుకి క్షేత్రం మరియు రాధాకృష్ణ పూల తోట వద్ద విచ్చేసి కీర్తనలు చేసినట్లు భక్తులు చెబుతున్నారు. క్రమంగా యాదృచ్ఛికంగా బరంపేట ప్రాంతంలో నివసించిన కత్తుల రాజ నరసింహ నాయుడు సాక్షాత్తు రాధా గోవిందుల దర్శనం పొందారు అని గత చరిత్ర చెపుతుంది. అనంతరం ఆయన భక్తితో తిరుపతి ఇస్కాన్ సంస్థకు ఆ పుణ్యభూమిని దానం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయన చూపిన తపన, సేవాభావం కారణంగా, కొద్ది కాలానికే ఇస్కాన్ బృందం ఆ స్థలాన్ని పరిశీలించి రాధా గోవింద దేవాలయానికి పునాది వేయడం జరిగింది. అనంతరం ఆ ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించబడుతున్నాయి. భక్తులు చెబుతున్నట్లు : ఇది సాధారణ ఆలయం కాదు, దైవ సంకల్పంతో ఏర్పడిన రాధా గోవింద క్షేత్రం. చైతన్య మహాప్రభు కీర్తనలు చేసిన పుణ్యభూమిలోనే ఈ దేవాలయం నిర్మాణం జరగడం దైవ లీలగా భక్తులు భావిస్తున్నారు. ప్రతిదినం ఇక్కడ జరిగే భజనలు, కీర్తనలు, గీతా పారాయణం భక్తుల మనసును దైవభావంతో నింపుతున్నాయన్నారు. భక్తుల కష్టసుఖాల్లో భగవంతుడు స్వయంగా భక్తులకు తోడుగా ఉన్నట్టుగా అనుభూతి చెందుతున్నారు. 16 ఏళ్ల సుందర యౌవనంలో ఉన్నట్టుగా రాధా గోవిందులు కనువిందు చేసే రూపంతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఆలయంలోని పరిసరాలు, పూల తోటలు, రాధా రాణి చిరునవ్వు, గోపాలుడి పాదాల చుట్టూ విరాజిల్లే ప్రకృతి ఇవన్నీ భక్తులలో ఒక ప్రశాంతత, ఆనందం, ఆధ్యాత్మికత నింపుతున్నాయి. ప్రతిదినము జరిగే గీతా పారాయణాలు, చైతన్య మహాప్రభు ప్రవచనాలు, కీర్తనల అనంతరం ప్రసాదాల పంపిణీ ద్వారా భక్తులు భగవంతుని అనుగ్రహాన్ని పొందుతున్నారు. ఇస్కాన్ భక్త బృందం ప్రతి భక్తుని ప్రేమతో ఆదరించి, సేవా భావంతో స్వాగతిస్తోంది. ఎవరు వచ్చినా హరే కృష్ణ నామస్మరణలో తానుగా లీనమై పోతారు. ఇస్కాన్ బరంపేట దేవాలయం నేడు నరసరావుపేట ఆధ్యాత్మిక కేంద్రంగా, భక్తి, ప్రేమ, సేవా మార్గాలను చూపుతున్న దైవ లీలా క్షేత్రంగా నిలుస్తోంది.

# పట్టణ గృహ నిర్మాణ, మెప్మా విభాగాల సమీక్ష సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి

### క్షేత్రస్థాయి పరిశీలన చేసి.. టిడ్కో గృహాల్లోని నివాస స్థితి, లబ్ధిదారుల వివరణపై తక్షణమే పూర్తి సమాచారం అందించండి : మాజీ మంత్రి ప్రత్తిపాటి. పట్టణ గృహ నిర్మాణ సిబ్బందికి ప్రత్తిపాటి ఆదేశం.







**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 19:**
చిలకలూరిపేట: టిడ్కో గృహ లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీ అందిన తర్వాత కూడా బ్యాంకులు వారికి మంజూరు చేయాల్సిన రుణాల్లో ఎందుకు జాప్యం జరుగుతోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో టిడ్కో గృహ రుణ సమస్యలు.. మెప్మా విభాగం పనితీరుపై.. పట్టణస్థాయి బ్యాంకర్లు, మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. పేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే గొప్ప ఆశయంతో గతంలో టీడీపీ ప్రభుత్వం పట్టణాల్లో టిడ్కో గృహాల నిర్మాణం చేపడితే గత ప్రభుత్వం వాటిని పాడుపెట్టి.. పేదల జీవితాలతో ఆటలాడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గృహాల నిర్మాణం 80–90 శాతం వరకు టీడీపీ హయాంలోనే పూర్తయినా మిగిలిన అరకొరపనులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వానికి మనసు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టిడ్కో గృహ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఈ నేపథ్యంలో ఇళ్లు పొందినవారిలో అధిక శాతం నివాసముండటం లేదని తెలిసిందన్నారు.

గృహాల్లో నివాసముండని వారు.... బ్యాంకు రుణాలు చెల్లించని వారి నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకుంటే.. శాఖాపరమైన చర్యలు తీసుకోండి.. టిడ్కో నివాస సముదాయాల్లో అన్ని వసతులు కల్పించినా, నివాసయోగ్యంగా ఉన్న ఇళ్లను నిరుపయోగంగా ఉంచడాన్ని ప్రభుత్వం సహించదన్నారు. ఈ సమస్య పరిష్కారం దిశగా ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. ఆ క్రమంలో నివాసముండని లబ్ధిదారులకు తక్షణమే నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాని, వారి సమాధానం సంతృప్తికరంగా లేకుంటే, ఇళ్లమంజూరును రద్దుచేసి ఆ గృహాలను అర్హులైన ఇతరులకు కేటాయించాలని ప్రత్తిపాటి పట్టణ గృహనిర్మాణ విభాగం అధికారుల్ని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఇళ్లులేని ఉపాధ్యాయులు గతంలో తమకు పట్టణ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని కోరారని, లబ్దిదారులకు అవసరం లేని టిడ్కో ఇళ్లు వారికి కేటాయించే అవకాశాలపై అధ్యయనం చేయాలని ప్రత్తిపాటి సూచించారు. పట్టణంలో ఇంకా 509 మంది లబ్ధిదారులకు బ్యాంకులోన్లు రాలేదన్న సమస్యపై స్పందించిన ప్రత్తిపాటి.. బ్యాంకర్లను ప్రశ్నించారు. అర్హులైన వారికి వెంటనే రుణాలు అందించాలని, ఇళ్లలో నివాసముంటేనే రుణమిస్తామనే హామీ కూడా తీసుకోవాలని సూచించారు. ఇళ్లు పొంది నివాసం లేకుండా.. రుణాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వారి ఇళ్లు రద్దుచేసి అర్హులకు కేటాయించండి గృహ నిర్మాణ నిమిత్తం లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడానికి తమకు ఇబ్బందిలేదని, డాక్యుమెంట్స్ సరిగా ఉండి. సిబిల్ స్కోర్ బాగున్నవారి దరఖాస్తుల్ని వెంటనే క్లియర్ చేస్తామని, కానీ గతంలో రుణాలు తీసుకొని ఇళ్లు పొందిన వారు, వాయిదాలు చెల్లించడంలేదని బ్యాంకర్లు ఎమ్మెల్యేకు తెలియచేశారు. బ్యాంకు వాయిదాలు కట్టనివారిని నేరుగా కలిసి సమస్య తెలుసుకోవాలని ప్రత్తిపాటి గృహనిర్మాణ విభాగం సిబ్బందికి సూచించారు. కావాలనే రుణాలు చెల్లించకుండా జాప్యం చేస్తూ, ఇళ్లల్లో ఉండనివారిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలానే నెలనెలా వాయిదాలు కడుతూ.. ఇళ్లల్లో నివాసముండని వారి నుంచి కూడా వివరణ తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది తనిఖీల్లో గృహ లబ్ధిదారుల నుంచి ఎలాంటి స్పందన, సరైన వివరణ లేకపోతే 6 నెలల సమయమివ్వాలని, అప్పటికీ వారు నిబంధనల ప్రకారం నడుచుకోకుంటే వారికి కేటాయించిన గృహాలను స్వాధీనం చేసుకొని, అర్హులైన ఇతరులకు అప్పగించాలని ప్రత్తిపాటి ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయంలో మొబైల్ నెట్ వర్క్ సరిగా లేదన్న సమస్యపై స్పందించిన ప్రత్తిపాటి.. స్థానిక జియో (రిలయన్స్) ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా టవర్ల పరిధిలో ఫ్రీక్వెన్సీ పెంచాలని వారిని ఆదేశించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై టెలికం కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. సోమవారం నాటికి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

అర్హులైన పేద, మధ్యతరగతి మహిళలు, యువత మెప్మా పథకాల సద్వినియోగంతో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి.

పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాల మహిళలు, యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ఆయావర్గాలకు చేరువ చేయాలని, అవసరమైతే ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలకు అర్థమయ్యేలా తెలియచేయాలని ప్రత్తిపాటి మెప్మా సిబ్బందిని ఆదేశించారు. పథకాల వివరాలు. వాటిద్వారా లభించే రుణం.. వడ్డీ రాయితీ.. చెల్లింపు విధానం గురించి స్పష్టంగా తెలియచేయాలన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా మెప్మా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అర్హులైన పేద కుటుంబాలను పీ–4పరిధిలోకి తీసుకొచ్చి, పట్టణపరిధిలోని మార్గదర్శులతో మాట్లాడి, ఆ కుటుంబాల బాధ్యతను వారికి అప్పగించాలని ప్రత్తిపాటి మెప్మా సిబ్బందికి సూచించారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాద్దుమల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, మెప్మా పీడీ. మురళి కృష్ణ, డిసివో శేఖర్ బాబు, మెప్మా సిఏయం అరిఫా సుల్తానా, టిడ్కో అధికారులు రాకేష్, బ్యాంక్ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి శుభాకాంక్షలు బాపట్ల జిల్లా అధికారులకు ప్రజలకు ప్రజా ప్రతినిధులకు మీడియా మిత్రులకు...

### దీపావళి శుభాకాంక్షలు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు.. విన్నకోట సురేష్..



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 19**

చీకటిపై కాంతి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, ఈ దీపావళి పండగ మీ జీవితంలో కొత్త ఆశలు నింపాలని, అవకాశాల దివ్వెలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తు, కష్టాలన్నీ దీపాల వెలుగుల్లో కలిసిపోవాలి. ఆనందాలు చిచ్చు బుడ్డి వెలుగుల్లా అంతటా విస్తరించాలి. దీపావళి నాడు వెలిగించే దీపాల్లాగే మీ జీవితంలో ప్రేమ, నవ్వు వెలిగిపోవాలి. అందరి జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలి. ఇంటిలో ప్రతి మూలా వెలిగించే దీపాల వరుస మాదిరిగా ప్రతి మనిషిలో మంచితనం, దయ, సేవాభావం వంటి గుణాలు ప్రకాశించాలని కోరుకుంటూ.. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, జర్నలిస్టులకు, వ్యాపారవేత్తలకు దీపావళి శుభాకాంక్షలు మీ అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్...

## వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 130వ దసరా నవరాత్రుల ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా పాల్గొని జీఎస్టీ ప్రయోజనాలను వివరించిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు




**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 19**

నరసరావుపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నాడు జరిగిన 130వ దసరా నవరాత్రుల కార్యక్రమాలు భక్తి సమ్మేళనంగా మారాయి. ఈ పవిత్ర ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పాల్గొన్నారు. జీఎస్టీ విధానం గురించి వివరంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అభియాన్ గురించి ప్రత్యేకంగా చర్చించారు. దేవస్థానంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైశ్య సమాజ ప్రముఖులు, భక్తులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు, నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొని ఆనందం పొందారు. దసరా నవరాత్రుల సందర్భంగా జరిగిన పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహవంతంగా జరిగాయి. డాక్టర్ అరవింద్ బాబు మాట్లాడుతూ జీఎస్టీ విధానం ప్రవేశపెట్టడం ద్వారా దేశవ్యాప్తంగా వ్యాపారులకు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనం చేకూర్చిందని తెలిపారు. జీఎస్టీ కేవలం పన్ను విధానం కాదు, ఇది ఆర్థిక వ్యవస్థను మరింత సమర్థవంతం చేసే సూపర్ టూల్. ఇది బహుళ పన్నుల స్థానంలో ఒకే పన్నును తీసుకువచ్చి, వ్యాపారాల్లో స్పష్టతను తీసుకువచ్చింది. ఫలితంగా, వస్తువులు, సేవలు ధరలు తగ్గడం ద్వారా ప్రజలకు మార్పు తెచ్చింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని ఆవరించిన అంధకారం తొలగించి, ప్రజల జీవితాల్లో వెలుగుల నింపాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం


### ప్రజలకు, కూటమి పార్టీల శ్రేణులకు, అభిమానులకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 19:**

గత పాలకుల అహంకార, అవినీతి, విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని ఆవరించిన అంధకారాన్ని సంపూర్ణంగా తొలగించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్న గొప్ప లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అన్నివర్గాల ప్రజల సంతోషం, సంక్షేమంతో పాటు.. రాష్ట్రప్రగతికి ప్రజానాయకుడు చంద్రబాబు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. ఈ దీపావళి రాష్ట్రప్రజలకు ఎంతో ప్రత్యేకం. ప్రతిష్టాతక ప్రపంచ స్థాయి సంస్థ గూగుల్ విశాఖలో భారీ పెట్టుబడి పెట్టేదిశగా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం నిజంగా ప్రజలు గర్వించాల్సిన విషయం. ఈ ప్రత్యేక దీపావళి అందరి ఇళ్లల్లో ఆనందాన్ని, ప్రతి ఒక్కరి ఆశలను, అన్ని వర్గాల ఐక్యతలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాను. మనలోని మంచి భావనలకు కొత్త వెలుగులు అద్ది.. మనలోని దుర్గుణాలను దూరం చేసుకుందాం. ముఖ్యమంత్రి చంద్రబాబు బృహత్తర లక్ష్యమైన విజన్–2047 దిశగా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిద్దాం. ప్రతి ఒక్కరూ ఈ దీపావళిని ఉత్సాహంగా, సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ, ప్రజలకు, కూటమి పార్టీల శ్రేణులకు, అభిమానులకు నా హృదయపూర్వక దీపావళి పర్వదిన శు భాకాంక్షలు తెలియచేస్తున్నాను" అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



# ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి..





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19**

జనసేన 44వ డివిజన్ అధ్యక్షులు పవన్ వెంకీ సేవాభావం అభినందనీయం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కొరిటిపాడు మున్సిపల్ పార్క్ వెనుక ఆర్‌సీయం పాఠశాల ప్రాంగణంలో 44వ డివిజన్ జనసేన అధ్యక్షులు పవన్ వెంకీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... 50 సంవత్సరాలు పైబడిన పెద్దవారిలో చాలామంది కంటి సమస్యలతో బాధపడుతుంటారు. అలాంటి వారందరికీ ఉపయోగపడే విధంగా ఈరోజు ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం. అవసరమున్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం కోసం శంకర్ ఐ హాస్పిటల్‌తో పవన్ వెంకీ గారు కలసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే దాదాపు 120 మందికి పరీక్షలు జరిగాయి, అందులో 60 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి, పూర్తి వైద్యసేవలు అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి" అని తెలిపారు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వచ్చి సేవలు పొందుతున్నారు. ఇది ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమం. ఇలాంటి సేవా కార్యక్రమాలు పశ్చిమ నియోజకవర్గ ప్రజల మేలు కోసం నిరంతరం కొనసాగుతాయి. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం కృషి చేస్తుంది" అని, సమాజసేవ కోసం కృషి చేస్తున్న జనసేన డివిజన్ అధ్యక్షులు పవన్ వెంకీని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, అడపా మాణిక్యాల రాజ్, విజయ లక్ష్మీ, పద్మలత మరియు శంకర్ ఐ హాస్పిటల్ వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జనసేన కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టైమ్ పాస్ కోసమే వైసిపి కోటి సంతకాలు సేకరణ..ఎమ్మెల్యే నసీర్..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19**

లిక్కర్ స్కామ్ బయటపడిందనే సాకుతో డైవర్షన్ రాజకీయాలు పీపీపీ విధానంతోనే అభివృద్ధి మెడికల్ కాలేజీలపై వైసీపీది తప్పుడు ప్రచారం వడ్డెరలకు మైనింగ్ లో 15 శాతం హర్షణీయం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ టైమ్ పాస్ కోసమే వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. లిక్కర్ స్కామ్ బయటపడిందనే సాకుతో డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మైనింగ్ రంగంలో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించడంపై ఆదివారం ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘ నాయకులు ఆదివారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వడ్డెరల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా అండగా ఉందని, గత ప్రభుత్వంలో బీసీ రిజర్వేషన్లు తగ్గించిందని చెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 16,800 మంది బీసీలు రాజకీయ అవకాశాలు కోల్పోయారని పేర్కొన్నారు. దేశమంతా పీపీపీ విధానంతోనే అభివృద్ధి పథంలో పయనిస్తుంటే.. వైసీపీ మాత్రం అభివృద్ధికి విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. మెడికల్ కాలేజీల నిర్మాణం ద్వారా పేదలకు సీట్లు లభిస్తాయని, దీనికి వైసీపీ ఓర్వుకోలేకపోతోందని మండిపడ్డారు. లిక్కర్ స్కామ్ లో జోగి రమేశ్ పాత్ర తేటతెల్లమైందని స్పష్టం చేశారు. ప్రజలకు తిరస్కరించినా వైసీపీకి బుద్ధి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవల్ల వెంకట్, చల్లా ఆంజనేయ ప్రసాద్, నగాల సుజాత, పెనుగొండ భాస్కర్, తన్నీరు సాంబయ్య, చల్ల నాగరాజు, ప్రసాద్, బత్తుల శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.టైమ్ పాస్ కోసమే వైసిపి కోటి సంతకాలు సేకరణ..ఎమ్మెల్యే నసీర్..

# తెనాలి లో ది ఆంధ్రా ప్యారిస్ వీడియో

### – ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభోత్సవ సభ ఘనంగా జరిగింది..





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19**

తెనాలి లోని జ్యోతి ఫర్నిచర్ బ్యాంక్వెట్ హాల్ సుల్తానాబాద్ లో ఆదివారం ఉదయం 10:30 గంటలకు ది ఆంధ్రా ప్యారిస్ వీడియో %ఇ% ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెనాలి (రెగడ్. నా. 379/2025) యొక్క నూతన ప్రారంభోత్సవ సభ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెనాలి మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సాంబశివరావు , మరియు ప్రసాద్ ల్యాబ్ అధినేత ప్రసాద్ హాజరై, ఫోటోగ్రాఫర్స్ సంక్షేమం, భద్రత, వృత్తి గురించి విలువైన సందేశం అందించారు. కార్యక్రమంలో సి.ఐ సాంబశివరావు అసోసియేషన్ లోగోను ఆవిష్కరించగా, ప్రసాద్ అసోసియేషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు, ఫోటోగ్రాఫర్స్ సమాజానికి కళ్లులాంటివారు , వారి కృషి లేకుండా ప్రతి ఆనంద క్షణం అసంపూర్ణం అవుతుంది అన్నారు. ఫోటో, వీడియో వృత్తి కూడా గౌరవప్రదమైన సేవ ః దీనిని కాపాడటానికి అసోసియేషన్‌లు కీలక పాత్ర పోషిస్తాయి, అని ప్రశంసించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కొత్త కార్యవర్గం నియామకం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు: పిల్లి ఫ్రాంక్లిన్ బాబు అధ్యక్షుడు: కాళిదాసు చైతన్య సెక్రటరీ: గ్లోరియస్ నాగరాజు వైస్ ప్రెసిడెంట్: ఆనంద్ డిసౌజా జాయింట్ సెక్రటరీ: షేక్ రఫీ ట్రెజరర్: కొల్లి భరత్ కుమార్ పిఆర్ఓ: యూ.నాగ గోవర్ధనరావు అలాగే సలహాదారులుగా ఎస్.కె. కాలేషా, ఎన్.ఎం డిజిటల్స్ గిరీష్, ఎన్ ఆర్ టి శ్రీనివాసరావు లు నియమితులయ్యారు. ఈ అసోసియేషన్ ముఖ్య ఉద్దేశ్యం ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియోగ్రాఫర్స్ సంక్షేమం కోసం పనిచేయడం, ప్రతి సభ్యునికి ఐడీ కార్డ్ తో పాటు రూ.10 లక్షల విలువైన రెండు సంవత్సరాల ప్రమాద బీమా అందించడం, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫోటో %ఇ% వీడియో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించడం, మరియు సోనీ, కానన్, నికాన్ వంటి కంపెనీలతో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయడం లాంటి ఎన్నో ప్రయోజనకరమైన కార్యక్రమాలతో ముందుకు వెళతాం అని అధ్యక్షులు చైతన్య వివరించగా ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అన్ని ఫోటోగ్రఫీ సహోద్యోగులకు, మీడియా మిత్రులకు, మరియు హాజరైన అతిథులకు సెక్రటరీ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయ సారధి బాబు సభాధ్యక్షత వహించగా శేఖర్, రాజు, శ్రీకాంత్ ,శివ సాగర్, సూర్య, బాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలిక రద్దు

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 19**

ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్, ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 20వ తేదీ సోమవారం దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించినందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుండి అర్జీలు ఇవ్వడానికి రానున్న వారు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.



## రాష్ట్ర వ్యాప్తంగా నగర ప్రజలకు పురపాలక సేవలు సులభతరం.. కమిషనర్ పులి శ్రీనివాసులు..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19**

రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్ ని అందుబాటులోకి తెచ్చిందని, నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్ లో డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధృవీకరణ పత్రాలు వంటి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చన్నారు. సమస్యలను ఫిర్యాదుతో పాటు ఫొటోలను కూడా అప్ లోడ్ చేయవచ్చని తెలిపారు. వీది దీపాలు, చెత్త పేరుకుపోవడం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అంశాలపై ఫిర్యాదులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ కూడా ఉంటుందన్నారు. ఫిర్యాదులు, సేవల పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉంటుందన్నారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, డి%ఇ%ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, డ్రైనేజి చార్జీలు, ఆస్తి పన్ను మ్యూటేషన్ ఫీజు, షాప్ లీజులు, అగ్రిమెంట్ ఫీజులు, అడ్వర్టైజ్మెంట్ ట్యాక్స్ లను యాప్ ద్వారా ఇంటి వద్ద నుండే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే వారం నుండి వార్డ్ సచివాలయాల వారిగా ప్రజలకు యాప్ డౌన్లోడ్, వినియోగంపై అవగాహన కల్గిస్తామని తెలిపారు.

## కాలుష్యం లేని దీపావళి, ఆనందమైన దీపావళిని

### ప్రతి ఒక్కరూ జరుపుకోవాలి.. కత్తెర హెనీ క్రిస్టినా..

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19**



ఈ దీపావళి పండుగ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలందరి ఇంటిలో వెలుగులు నింపాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆకాక్షించారు. కాలుష్యం లేని దీపావళి, ఆనందమైన దీపావళిని ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని అన్నారు. ఈ నెల 20వ తేదీన దీపావళి పండగ సందర్భంగా ప్రజలు హరిత టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రమాదాలకు గురి కాకుండా దీపావళి జరుపుకోవాలని కోరారు. దీపావళి పండుగ ప్రతి ఇంటిలో సుఖ సంతోషాలు, ఆనందం తీసుకురావాలని చూచించారు. పిల్లలను ఒంటరిగా బాణసంచా కాల్చడానికి అనుమతించవద్దు ప్రజలు, విక్రయదారులు సురక్షిత చర్యలు తీసుకుని దీపావళిని ఆనందంతో, సంతోషంతో జరుపుకోవాలని కోరారు. ఎటువంటి ప్రమాద పరిస్థితులకు తావివ్వరాదని సూచించారు.

# బాపట్ల పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సీసీ కెమెరాలను ప్రారంభించిన బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు







**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 19**

బాపట్ల పట్టణంలో అధునిక సాంకేతికతను కలిగిన సీసీ కెమెరాలను పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడం జరిగిందని బాపట్ల డిఎస్పి రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల డిఎస్పి రామాంజనేయులు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రిచ వచ్చున్నారు. అలాగే ప్రమాదాలు జరుగుతున్నప్పుడు వాహనాలను గుర్తించడానికి వీలు లేకుండా ఉంటుందని ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల వాహనాలను గుర్తించడానికి సులువుగా ఉంటుందని డిఎస్పి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నేరాల నియంత్రణ మరియు పట్టణంలో ఎప్పటికప్పుడు ప్రజల కదలికలను గుర్తించడానికి సులువుగా ఉంటుందని అలాగే ఆకతాయిలా ఆటలను ఆకతాయిలా కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు దోహదపడతాయని డిఎస్పి రామాంజనేయులు అన్నారు. ప్రత్యేకంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను బాపట్ల డిఎస్పి రామాంజనేయులు అభినందించారు. ఈ సందర్భంగా బాపట్ల డిఎస్పి రామాంజనేయులు పట్టణ సిఐ రాంబాబు ను దుశాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ సిఐ రాంబాబు, ఎస్ఐ విజయ్ కుమార్,బాపట్ల రెడ్ క్రాస్ సభ్యులు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా సీఎం సహాయనిధి

**ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చొరవతో**

**62 మందికి రూ.55 లక్షలు పంపిణీ**





**చీరాల,పెను పవర్ ,అక్టోబర్ 19 :**

ప్రజల పక్షాన ప్రభుత్వం మరోసారి అండగా నిలిచింది. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చొరవతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితులకు ఆర్థిక సాయం అందింది. మొత్తం 62 మంది లబ్ధిదారులకు రూ.55 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు.ఇప్పటి వరకు మొత్తం 510 మందికి రూ.5.35 కోట్లు ప్రధాని సహాయనిధి ద్వారా చీరాల నియోజకవర్గంలో సహాయం అందిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగింది.ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతకు కట్టుబడి ఉందన్నారు. “ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులో ఉంది. అయినా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు బిల్లులు, రసీదులు సమర్పిస్తే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం లభిస్తుంది,” అని చెప్పారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల ఆరోగ్య సంరక్షణలో సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు.సహాయం పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయపథంలో అలుపెరుగని సేవలు

**ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్**

**గుంటూరులో ఆత్మీయ అభినందన సభ**

**కార్యక్రమంలో పాల్గొన్న శుభాకాంక్షలు తెలిపిన**

**రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ**



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 19**

సామాజిక న్యాయపథంలో నిబద్ధతతో అంచలంచెలుగా సేవలు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమీషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను గుంటూరు పట్టణంలో ఆయన మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గుంటూరు మెడికల్ కాలేజి ఎదురుగా ఉన్న ఏపీఎన్జీజీవోస్ రిక్రియేషన్ హాల్‌లో ఆదివారం నాడు ఆత్మీయ అభినందన సభ జరిగింది.ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, అభిమానులు హాజరై చైర్మన్ జవహర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ మర్యాదపూర్వకంగా చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అడపా మోహన్ మాదిగ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, దళితుల హక్కుల పరిరక్షణ దిశగా కొత్తపల్లి శామ్యూల్ జవహర్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. “దళిత వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి ఎస్సీ కమిషన్ చైర్మన్ కృషి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆయన మరింతగా దళిత జాతికి సేవ చేయాలని ఆకాంక్షించారు.”సభకు హాజరైన ఇతర నాయకులు, ప్రముఖులు కూడా చైర్మన్ జవహర్ సేవలను కొనియాడారు. కొత్తపల్లి శామ్యూల్ జవహర్ మాట్లాడుతూ, దళితుల హక్కులు, సంక్షేమం కోసం కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని, సామాజిక న్యాయం కోసం తన పోరాటం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

# దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

**ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్ష**

**చీకట్లను తరిమేసే పండుగ దీపావళి**

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 19**

రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు ప్రజల జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు ప్రసరించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్నారని,ఈ దీపావళి విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. టపాసుల వెలుగులతో, దీప కాంతుల జ్యోతులతో, సిరిసంపద రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని కోరుకుంటున్నాను. కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను,” అని తెలిపారు. ప్రజల చీకట్లను చెరిపేసే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లను పారద్రోలినట్లుగా ఒక్కొక్క మార్పు సాధించుకుంటూ బంగారు భవిష్యత్‌ను నిర్మించుకుందామని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు.అష్టలక్ష్ములు ప్రతి ఇంట్లో నెలవై సకల శుభాలను, ధైర్యాన్ని, స్థైర్యాన్ని, విజయాలను, సిరి సంపదలను, సుఖ సంతోషాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ,తెలుగింటి లోగిళ్లన్నీ దీప కాంతులతో వెలుగులీనాలని, ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.



# ఒక విశిష్టమైన సన్మాన కార్యక్రమం.. కత్తెర హెనీ క్రిస్టినా..





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 19.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ కోతపల్లి శామూయేల్ జవహర్ కి ఘనంగా నిర్వహించబడింది. సామాజిక న్యాయం, సాధికారత మరియు వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చూపిన విశిష్ట సేవలను గుర్తించి ఈ కార్యక్రమం “ఆత్మీయ అభినందన సభ” పేరుతో గుంటూరులోని ఏపీఎన్జీవోస్ రిక్రియేషన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించి, ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణలో జవహర్ గారు చూపుతున్న కృషి, ఆయన అంకితభావం మరియు సమానత్వం, న్యాయం సాధనలో చేస్తున్న నిరంతర సేవలను ప్రశంసించారు. జిల్లా పరిషత్ నందు జరిగిన ఏ ఓ ప్రమోషన్స్ విషయం లో జవహర్ సహాయం చాలా ఉపయోగపడ్డాయి అని, ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయగలిగాము అని తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కత్తెర సురేష్ కుమార్ (టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి) మాట్లాడుతూ, జవహర్ గారు నిజాయితీ, కరుణా మూర్తి, సమాజ సేవలో దారిదీపమని పేర్కొన్నారు. ఆయన నేతృత్వం, సామాజిక దృష్టికోణం అనేక మందికి ప్రేరణనిచ్చేవని అన్నారు. ఈ సందర్భంలో ప్రముఖ అతిథులు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు , ఎమ్మెల్యే రామాంజనేయులు (రిటైర్డ్ ఐఏఎస్) మరియు గల్లా మాధవి తమ శుభాకాంక్షలు తెలియజేసి, జవహర్ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేసిన విశేష సేవలను కొనియాడారు. సభలో పాల్గొన్నవారు జవహర్ ప్రజా సంక్షేమానికి అంకితభావంతో సేవలందిస్తూ, సమాన హక్కులు కలిగిన సమాజ నిర్మాణం వైపు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమం చివరగా ఆయనకు సూచకంగా శాలువా, గుర్తు చిహ్నం అందజేసి సన్మానించారు.

# చీరాల బీచ్‌లో కలెక్టర్ వినోద్ పర్యటన

## పర్యాటకుల భద్రతపై దృష్టి -బీచ్‌లో పెట్రోలింగ్‌పై ఆదేశాలు









**చీరాల, పెన్ పవర్ ,అక్టోబర్ 19**

చీరాల బీచ్ వద్ద పర్యాటకులు ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం బీచ్‌ను పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల, చీరాల బీచ్‌లకు శని, ఆది రోజుల్లో ఎక్కువ మంది పర్యాటకులు చేరుకుంటారని, వారి భద్రత కోసం సముద్రంలో బోట్లతో పెట్రోలింగ్ నిర్వహించాలని, పెట్రోలింగ్ సిబ్బందికి లైఫ్‌జాకెట్లు, విజిల్స్ ఇచ్చి సజాగ్రత్తగా ఉండాలని సూచించారు.స్వచ్ఛత, మౌలిక వసతులపై దృష్టిపొట్టి సుబ్బయ్యపాలెం బీచ్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రామాపురం బీచ్ వరకు రోడ్డును విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అలాగే బీచ్‌లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.మత్స్యకారులతో సంభాషణపర్యటన సందర్భంగా కలెక్టర్ మత్స్యకారులతో మాట్లాడుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెన్నై నుండి పెద్ద బోట్లు వచ్చి జాలర్ల వేటను అడ్డుకుంటున్నాయని, వాటిని నివారించాలని మత్స్యకారులు కోరారు.అలాగే గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని, తక్కువ వోల్టేజ్ సమస్యకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో వేటపాలెం ఎంపీడీఓ రాజేష్, తహసీల్దార్ గీతారాణి, ఎస్సై జనార్ధన్ ,ఎంపీడీవో రాజేష్ బాబు,సెక్రెటరీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 19:**

ప్రమాదాలకు తావులేని ప్రశాంతమైన వాతావరణం మధ్యలో కుటుంబ సభ్యులందరి సమక్షంలో ఆనందభరితంగా ఈ దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్., కృష్ణాజిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలను, సంతోషాలను, కొత్త కాంతులను తీసుకురావాలని, అలాగే దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు. చిన్న పిల్లలతో టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్త వహిస్తూ, తల్లిదండ్రులు లేదా పెద్ద వారి పర్యవేక్షణలో వారు ఉండేలా చూడాలని తెలిపారు. అధిక శబ్దం కలిగిన బాణసంచాను కాల్చే సమయంలో తోటి వారికి ఇబ్బంది కలగకుండా బంధుమిత్రులు, కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని సూచించారు. అనధికారికంగా బాణ సంచా నిల్వలు కలిగి ఉండటం వలన ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. కనుక అలాంటి సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని అన్నారు. మందు గుండు సామాను, బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ పద్ధతులను అవలంబించాలని, దుకాణ యజమానులు నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ప్రతి ఒక్కరం బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చు. ప్రమాదాలు లేని దీపావళి జరుపుకోవడానికి ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి తెలియజేశారు.

# బాబు హయాంలో మెడికల్ కళాశాలలు "సున్నా"

కుటమి ప్రభుత్వం.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం -పేద విద్యార్థులు కూడా వైద్యులు కావాలన్నదే జగన్ ఆశయం

జగన్ కి మంచి పేరు వస్తుందనే బాబు కుట్ర -ప్రైవేటు వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దారుణం

-కోటి సంతకాల సేకరణ అందరి బాధ్యత







**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ అక్టోబర్ 19**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసిన హయాంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా తీసుకొచ్చిన పాపాన పోలేదని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైయస్సార్ సిపి ఇన్చార్జి అన్నా రాంబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఒకటవ,నాలుగవ , 11వ బ్లాక్ లలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాని కిముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు , వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి , నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి,మాజీ రాష్ట్ర మైనార్టీ నాయకులు షంషీర్ అలీబేగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైయస్ఆర్సీపీ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజల మేలు కోసం 17 మెడికల్ కాలేజీలకు వైయస్ జగన్ అనుమతి తీసుకొచ్చారని అన్నారు. అతి తక్కువ ఖర్చుకే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందాలని జగన్ ఆశించారని తెలిపారు. ఈ క్రమంలో ఐదు కళాశాలలో తరగతులూ ప్రారంభం అయ్యాయని మరో రెండు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న కాలేజీలనూ పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మహిళలకు ప్రమిదలు పంపిణీ చేసిన బిజెపి నాయకులు



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 19**

దీపావళి పండుగ సందర్భంగా మహిళలకు బిజెపి నాయకులు స్వదేశీ ప్రమిదలను పంపిణీ చేశారు. ఆదివారం నాడు మండలంలోని అంకాలమ్మ గుడి వద్ద మహిళా భక్తులకు స్వదేశీ ప్రమిదలను అందజేశారు. ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ లో భాగంగా ఇంటింటా స్వదేశీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల బిజెపి ప్రధాన కార్యదర్శి మరియు ఆత్మ నిర్భర్ భారత్ మండల కో కన్వీనర్లు సయ్యద్ ఖాదర్ భాష, ఎన్ నాగేశ్వరరావు లు చెప్పారు.

## ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు

**ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు**

**వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ**



**సి ఎస్ పురం,పెన్ పవర్ అక్టోబర్ 19**

మండలంలోని ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం వచ్చు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో సమాచార కేంద్రం, విరాళాల కౌంటర్, మైక్ అనౌన్స్మెంట్ వ్యవస్థ, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే కార్తీక మాసం సందర్భంగా వచ్చు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని,కార్తీక సోమవారాల్లో భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మూలధరణ చేసిన స్వాములకు త్వరగా దర్శనం అయ్యేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షనీయం

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 19**

దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డి ఏ ను విడుదల చేయడం అలాగే 60 రోజుల్లో హెల్త్ కార్డ్స్ వ్యవస్థను సక్రమముగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్సు విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్ పై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల మరియు చైల్డ్ కేర్ లీవ్ పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై మహిళా ఉద్యోగులలో ఆనందం నింపిందని, సంఘ భవనాల ప్రాపర్టీ టాక్స్ మినహాయింపు , బకాయిల రద్దు చేయడం పై గిద్దలూరు జాయింట్ యాక్షన్ కమిటీ, గిద్దలూరు ఎపి ఎం జి జి ఓ అసోసియేషన్ ముఖ్యమంత్రి కి , ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవు కు పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు , మంత్రి సత్య కుమార్ కు చీఫ్ సెక్రటరీ కే. విజయానంద్ కు గిద్దలూరు జెఎసి పక్షాన ఎపి ఎన్ జి జి ఓఎస్ అసోసియేషన్ పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

## వలీమా కార్యక్రమంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 19**

గిద్దలూరు పట్టణం, నంద్యాల రోడ్డులోని చీతీరాల కళ్యాణ మండపంలో నాయక్ వీధికి చెందిన టిడిపి నాయకులు సయ్యద్ అప్సర్ బాషా కుమారుడు ఖాదర్ బాషా వలీమా కార్యక్రమంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బాణసంచా విక్రయశాలలను సందర్శించిన డిఆర్ఓ





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 19**

దీపావళి సందర్భంగా ఒంగోలు నగరంలోని పివిఆర్ బాలుర పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయశాలలను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదివారం సందర్శించారు. విక్రయాలు జరుగుతున్న తీరు, ధరలు, ప్రమాదాలు జరగకుండా తీసుకున్న చర్యలు, అవాంఛనీయ ఘటనలను సమర్థంగా ఎదుర్కొనేందుకు విపత్తుల నిర్వహణ శాఖ సన్నద్ధత, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. బాణసంచా కొనుగోలుదారులతోనూ డీఆర్వో మాట్లాడారు. ఈ వెలుగుల పండుగను సంతోషంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ వెంట ఒంగోలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ తుమ్మల రాంభూపాల్ రెడ్డి, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా కదిరి వెంకట నరసయ్య 33వ వర్ధంతి వేడుకలు

**సి ఎస్ పురం,పెన్ పవర్ అక్టోబర్ 19**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామానికి చెందిన కదిరి వెంకట నరసయ్య 33వ వర్ధంతి వేడుకలు ఆదివారం హైదరాబాద్ లో ఆయన కుమారులు కె వి ప్రకాశ్ రావు,కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు,కదిరి పార్థసారథి, కదిరి బాలకృష్ణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట నరసయ్య సమాధి వద్ద కుమారులు, కోడళ్ళు, కుమార్తెలు, మనవరాళ్లు, మనవళ్ళు,ముది మనవళ్ళు మరియు కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుంకరి వెంకటాద్రి,కె పి నాయుడు, కదిరి కృష్ణ, ఇరగని చలపతి రావు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలకు తరలివెళ్ళిన ఆర్యవైశ్యులు

- వైభవంగా రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవాలు







**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, అక్టోబర్ 19**

మంగళగిరిలోని సికె కన్వెన్షన్ హాల్లో ఆదివారం వైభవంగా జరిగిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలకు కనిగిరి నుంచి పలు వాహనాలలో ఆర్యవైశ్య పట్టణ ప్రముఖులు రాచపూటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఆర్యవైశ్యులు తరలి వెళ్లారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలకు గ్లోబల్ అధ్యక్షులు తంగుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలకు రాష్ట్రమంత్రి టీజీ భరత్, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, జాతీయ వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీకి కనిగిరి నుంచి ఎన్నికైన అన్నా రంగనాయకులు, పైడిమర్రి కృష్ణ, గర్రె శీను, గాదంశెట్టి కిరణ్ తదితర వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సభ్యులకు శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు.

# వైఎస్ఆర్ సిపి జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా సారే జనార్ధన్ నాయుడు



**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 19**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొమరోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సారే జనార్ధన్ నాయుడును నియమిస్తూ వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. సారే జనార్ధన్ నాయుడు వైఎస్ఆర్సిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా చేరి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు, సూచనలు సలహాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు పార్టీ సేవయే పరమావధిగా భావించి పార్టీ అభివృద్ధికి ,కార్యకర్తల అభ్యున్నతికి కృషి చేస్తూ వచ్చారు. . పదవుల కంటే పార్టీ అభివృద్ధే లక్ష్యంగా, పరమావధిగా భావించి కృషి చేస్తూ,మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ వస్తున్నారు. .కాగా వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం ప్రకాశం జిల్లా స్థాయిలో వివిధ విభాగాలకు పార్టీ నేతలకు పదవులను కల్పించింది. అందులో భాగంగా కొమరోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సరే జనార్ధన్ నాయుడును ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రకాశం జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా జనార్ధన్ నాయుడును నియమించడం పట్ల కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, మండల వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి, మండల కన్వీనర్ మేరీగా రవికుమార్ ,మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ఎం సుభాని ,తిరుపతి రాజు ,జాజం వెంకటరమణ,,సారే సుజాత, గిద్దలూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ విభాగమ అధ్యక్షులు బంగారు విశ్వరూపం ,మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ షేక్ ఖాసిం సాహెబ్ ,మండల వైసీపీ నాయకులు వీరం రెడ్డి మోహన్ రెడ్డి ,గోల్కొండ అబ్దుల్ సుభాన్, గుడిపాటి ప్రసాద్, ఉలాపు రామచంద్రుడు, సర్పంచులు దండు శశికళ ,షేక్ హటేల్ పీరా, వైజా నారాయణరెడ్డి, గుడిపాటి ప్రదీప్, రమణమ్మ,బొమ్మిని రంగమ్మ, బంగారు రత్నాలు, సారే రమణమ్మ, కాశమ్మ ,జయరామిరెడ్డి, కొమరోలు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, గోల్కొండ బ్రదర్స్ హర్షం వ్యక్తం చేస్తూ రమణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. . ఆ సందర్భంగా జనార్ధన్ నాయుడు మాట్లాడుతూ తాను ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రమశిక్షణ గల సైనికునిగా పనిచేస్తూ వస్తున్నానని ,తనకు పదవుల కంటే పార్టీ అభివృద్ధే ముఖ్యమని, రాబోయే ఎన్నికలలో పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరొక పర్యాయం ముఖ్యమంత్రిగా చూడాలన్నదే లక్ష్యంగా చేసుకొని కృషి చేస్తానని ఆయన పేర్కొంటూ, తనకు జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ,కేంద్ర కమిటీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# పాస్ పోర్టు తడిచింది.. ఎఫ్-1 వీసా చెదిరింది..




**హైదరాబాద్  పెన్ పవర్:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఓ భారతీయ విద్యార్థికి ఊహించని సమస్య ఎదురైంది. ఓ చిన్న ప్రమాదం కారణంగా అతని పాస్‌పోర్ట్ తడవడంతో , దానిపై ఉన్న అత్యంత ముఖ్యమైన ఎఫ్–1 (F-1) విద్యార్థి వీసా స్టాంప్‌లోని అక్షరాలు చెదిరిపోయాయి. దీంతో ఆ విద్యార్థి ప్రస్తుతం అమెరికాలో ఉండిపోయి, కొత్త వీసా కోసం భారత్‌కు తిరిగి వెళ్లాలా వద్దా అనే గందరగోళంలో పడ్డాడు. తాజాగా Redditµ ద్వారా తన అనుభవాన్ని పంచుకున్న ఈ విద్యార్థి, వీసా బయటికి చూడటానికి బాగానే ఉన్నట్టు కనిపించినా, ఎయిర్‌పోర్టుల్లో ఉపయోగించే స్కానర్‌లు మాత్రం దాన్ని గుర్తించలేకపోతున్నాయని తెలిపాడు. భారత్ నుండి అమెరికాకు తిరిగి ప్రయాణించే సమయంలో విమాన సిబ్బంది వీసా వివరాలను చెక్ చేయలేకపోయారని, ఇది పెద్ద గందరగోళానికి దారితీసిందని వివరించాడు.

**అమెరికాలో లీగల్ స్టేటస్ సురక్షితమే**

శుభవార్త ఏంటంటే, వీసా ముద్ర చెదిరిపోయినప్పటికీ, విద్యార్థి అమెరికాలో ఉన్నంత కాలం అతని చట్టపరమైన స్థితి సురక్షితంగానే ఉంటుంది. ఎందుకంటే, ఇమ్మిగ్రేషన్ రికార్డులు అన్నీ ఎలక్ట్రానిక్‌గా భద్రపరచబడి ఉంటాయి. కానీ, ఇక్కడే అసలు సమస్య ఉంది.

అమెరికా దేశం బయటికి వెళ్లి, తిరిగి దేశంలోకి ప్రవేశించాలంటే మాత్రం పాస్‌పోర్ట్‌పై ఉన్న ఫిజికల్ వీసా స్టాంప్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే స్థితిలో ఉండాలి.

**అమెరికాలో వీసా రీప్లేస్‌మెంట్ ఉండదు**

అమెరికా వీసా నిబంధనల ప్రకారం, ఎఫ్–1 వీసా స్టాంప్‌ను అమెరికాలో ఉండగా తిరిగి ముద్రించుకునే (replacement or re-stamping) అవకాశం లేదు. దీని కోసం ఆ విద్యార్థి తప్పనిసరిగా భారత్‌కు తిరిగి వెళ్లి అప్లై చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమెరికా కాన్సులేట్‌లలో వీసా ఇంటర్వ్యూల కోసం ఎక్కువ వేచి ఉండే సమయం ఉంది. పైగా ఇంటర్వ్యూ వేవర్ సదుపాయం తాత్కాలికంగా నిలిచిపోవడంతో మళ్లీ కొత్తగా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి వస్తోంది.

**గ్రాడ్యుయేషన్ వేళ ఆందోళన**

ఈ విద్యార్థికి మరో రెండు నెలల్లోనే గ్రాడ్యుయేషన్ పూర్తి కానుంది. ఆ తర్వాత అతను తన ఎఫ్–1 వీసా నుంచి OPT (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ) దశకు మారాలి. ఇలాంటి కీలక సమయంలో ప్రయాణం చేయడం అనేది చాలా ప్రమాదకరం అని ఇమ్మిగ్రేషన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీసా స్పష్టంగా ఉండే బాధ్యత పూర్తిగా వీసా హోల్డర్‌పైనే ఉంటుందని అమెరికా ఇమ్మిగ్రేషన్ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఆ విద్యార్థి, తన కొత్త వీసా దరఖాస్తు ప్రక్రియ %ూా% లేదా ఉద్యోగ అవకాశాలపై ఎటువంటి ప్రభావం చూపకుండా ఉండేందుకు, భారత్‌కు తిరిగి వెళ్లేందుకు సరైన సమయం కోసం లెక్కలు వేసుకుంటున్నాడు.

# హాట్ టాపిక్... 'అమెరికాలోని భారతీయులందరినీ బహిష్కరించాలి'!



**హైదరాబాద్  పెన్ పవర్:** భారతదేశంలో చాలామందికి అమెరికా ఓ కీలక గమ్యస్థానం అనే చెప్పాలి! ఉన్నత చదువుల కోసమో, ఉజ్వల భవిష్యత్తు కోసమో ఉన్న ఊరిని, కన్నవారిని వదిలి చాలా మంది అగ్రరాజ్యం వైపు పయనమవుతూ ఉంటారు. ఈ విషయంలో కొంతమంది సక్సెస్ అవుతుంటే.. మరికొంతమంది నిరాశ చెందుతుంటారు. మరోవైపు అమెరికా ఆర్థిక ప్రగతిలో, అభివృద్ధిలో భారతీయుల పాత్రం కీలకం అనే మాటలూ వినిపిస్తుంటాయి. పైగా ప్రపంచం మొత్తం ఓ కుగ్రామంగా మారిపోయినా ఈ రోజుల్లో అనేక దేశాల వారు మరో దేశానికి వెళ్లి ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడం.. మరికొంతమంది అక్కడే స్థిరపడిపోవడం జరుగుతుందనే విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికాకు %–% భారత్ కు ఉన్న సంబంధం ప్రత్యేకం అనే చెప్పాలి. ఈ సమయలో అమెరికాలో ఉన్న భారతీయులపై ఓ రాజకీయ నాయకుడు విధ్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం కలకలం రేపింది. అవును... అమెరికాలో ఉన్న భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలని కోరుతూ ఆ దేశానికి చెందిన రాజకీయ నాయకుడు చాండ్లర్ లాంగేవిన్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. ఇలా యూఎస్ లో ఉన్న ప్రతి భారతీయుడిని తక్షణమే బహిష్కరించాలంటూ ఆయన పెట్టిన పోస్టులుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో పామ్ బే నగర కౌన్సిల్ ఆయనపై చర్యలు తీసుకుంది. అసలేం జరిగిందనేది ఇప్పుడు చూద్దామ్... !వివరాళ్లోకి వెళ్తే... ఓ భారతీయ ట్రక్ డ్రైవర్ చేసిన ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిందనే విషయాన్ని ప్రస్థావిస్తూ... 'అమెరికాలోని భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలి' అని ఫ్లోరిడాలోని పామ్ బే సిటీ కౌన్సిల్ కు చెందిన యూఎస్ కన్జర్వేటివ్ నాయకుడు చాండ్లర్ లాంగేవిన్ రాసుకొచ్చారు. ఇదే సమయంలో... అమెరికా గురించి పట్టించుకునేందుకు ఒక్క భారతీయుడు కూడా లేరని అన్నారు. ఇదే క్రమంలో... భారతీయులు మనల్ని ఆర్థికంగా దోపిడి చేస్తున్నారని.. భారత్ ను, ఆ దేశ ప్రజలను ప్రోత్సహించేందుకే వారు ఇక్కడ ఉన్నారని.. అమెరికన్ల కోసం మాత్రమే ఈ దేశం అని ఆయన మరో పోస్టులో వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగని ఆయన... ఈ రోజు తన పుట్టినరోజని.. ప్రతి భారతీయుడి వీసాను రద్దు చేసి వారిని ఇక్కడి నుంచి బహిష్కరించాలని.. ఇదే తన కోరిక అంటూ ఓ పోస్ట్ పెట్టి, దానికి ట్రంప్ ను ట్యాగ్ చేశారు. ఈ వ్యాఖ్యలను పామ్ బే మేయర్ మదీనా తీవ్రంగా తప్పుబట్టారు. ఇతరులను కించపరిచేలా, విలువలు తగ్గించేలా మన మాటలు ఉండకూడదని, అలాంటి వారికి ఇక్కడ చోటులేదని ఘాటుగా బదులిచ్చారు. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో నగర కౌన్సిల్ కు ఫిర్యాదులు అందాయి. దీంతో కౌన్సిల్ లాంగేవిన్ పై చర్యలు తీసుకుంది. ఇక నుంచి ఆయన ఏదైనా అజెండాను ప్రవేశపెట్టాలనుకుంటే ముందే ఏకాభిప్రాయం పొందాల్సి ఉంటుందని సూచించింది. ఇలా అతని నోరు మూయించడం కూడా చర్చనీయాంశంగా మారిన వేళ... ఈ చర్యలను లాంగేవిన్ తీవ్రంగా ఖండిచడంతో పాటు, కౌన్సిల్ తీర్మానం తన వాక్ స్వేచ్ఛ హక్కును ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు.

# 'NRI కాదు MRI'... పవన్ 15 ఏళ్ల ఆకాంక్షపై లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు!

**హైదరాబాద్  పెన్ పవర్:** ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఏపీ మంత్రి నారా లోకేష్.. సిడ్నీలో ప్రవాసాంధ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక విషయాలను ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... చంద్రబాబు అరెస్ట్, ఏపీకి గూగుల్, పవన్ 15ఏళ్ల కూటమి కోరిక మొదలైన విషయాలతో పాటు ఎన్నారైలకు కొత్త పేరు పెట్టారు నారా లోకేష్. అవును... ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేష్.. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ప్రాంగణంలోని బ్రూవర్స్ పెవిలియన్ నోబుల్ డైనింగ్ రూమ్ లో జరిగిన ఆస్ట్రేలియా తెలుగు డయాస్పోరా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ దేశానికి వెళ్లినా తెలుగువాళ్లు కనిపిస్తారని.. తెలుగు వాళ్ళు లేని దేశమే లేదని.. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు మనదే డామినేషన్ అని అన్నారు.



**తెలుగువాడి సత్తాను ప్రపంచానికే పరిచయం చేశారు!:**

ఈ సందర్భంగా... తెలుగువాడి సత్తాను ప్రపంచానికే పరిచయం చేసింది చంద్రబాబునాయుడు అని చెప్పిన లోకేష్.. 1995లో పెద్దఎత్తున సంస్కరణలు తీసుకువచ్చి ఐటీ విద్యను దగ్గర చేశారని తెలిపారు. కంప్యూటర్ అన్నం పెడుతుందా.. ఫ్లైఓవర్లు కడితే అభివృద్ధి జరిగినట్లా.. ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల ఏం జరుగుతుంది.. అని ఆనాడు ఎగతాళి చేసినవారి నోటి నుంచి నేడు మాట రావడం లేదని అన్నారు.

అలాంటి చంద్రబాబుని వైసీపీ ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు మీరంతా ఎంతో బాధపడ్డారని.. ఆస్ట్రేలియాలోని ప్రతి సిటీలో మీరు నిరసన కార్యక్రమాలు చేశారని.. మా కుటుంబానికి అండగా నిలబడ్డారని లోకేష్ అన్నారు. ఆ రోజు హైదరాబాద్ లో 45వేల మంది వచ్చి మాకు అండగా నిలబడ్డారని.. అప్పుడే ప్రజలకు సేవ చేయాలని, ప్రజల మెప్పు పొందాలని సంకల్పించానని స్పష్టం చేశారు.

**కేంద్ర సహకారం వల్లే రాష్ట్రానికి గూగుల్!**

ఇదే సమయంలో... కేంద్ర సహకారంతో కొప్పర్తి నోడ్, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, ఎన్టీపీసీ గ్రీన్ ప్రాజెక్ట్, నక్కపల్లి ఫార్మాసిటీ.. ఇలా అనేక కార్యక్రమాలు మనం చేయగలుగుతున్నామని చెప్పిన లోకేష్... వాస్తవంగా గూగుల్ సిటీ కూడా మనకు వచ్చిందంటే దానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ సహకారమని తెలిపారు.

**పవన్ కల్యాణ్ 15 ఏళ్ల కోరికపై స్పందిస్తూ..!:**

తాజాగా ఇటీవల ప్రధాన మంత్రి కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సభలో ప్రసంగించిన పవన్... ఇబ్బందులున్నా, ఏమున్నా ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం 15 ఏళ్లకు తక్కువ కాకుండా బలంగా ఉండాలని ఆకాంక్షిచిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని లోకేష్ ప్రస్థావించారు. ఇందులోభాగంగా... సోదర సమానుడైన పవనన్న ఒక క్లారిటీతో కలిసికట్టుగా ముందుకు వెళ్దామని చెప్పారని.. పొత్తు ఉన్నప్పుడు చిన్న, చిన్న సమస్యలు ఉంటాయని.. వచ్చే 15 ఏళ్ల పాటు కలిసికట్టుగా ఏపీని ముందుకు తీసుకెళ్దామని పదేపదే చెబుతున్నారని అన్నారు. అన్ని రంగాల్లో ఆంధ్ర రాష్ట్రం నెం.1గా ఉండాలనేదే ఏకైక అజెండాతోనే ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**ఎన్నారై లు ఎమ్మారైలు!:**

ఈ సందర్భంగా... 'అందరూ మిమ్మల్ని ఎన్నారైలు (నాన్ రెసిడెంట్ ఇండియన్స్) అంటారు.. కానీ, నేను మాత్రం మిమ్మల్ని ఎమ్మారై లు అంటాను.. ఎమ్మారై లు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్.. సముద్రాలు దాటినా సొంత ఊరు, సొంత రాష్ట్రం అంటే మీకు ప్రేమ" అని చెప్పిన లోకేష్... మీరు మీ కంపెనీల్లో బ్రాండ్ అంబాసిడర్స్ కావాలని అక్కడున్న తెలుగువారిని కోరారు.

# భారత్ 'దోస్త్' కు వెన్నుపోటు పొడిచిన ఫలితం అనుభవిస్తున్న టర్కీ..!

**హైదరాబాద్  పెన్ పవర్:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ %–% పాక్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిన సమయంలో.. ఉగ్రవాదులు చేసిన పనిని ప్రపంచ దేశాలు ఖండించాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో భారత్ కు తమ మద్దతును ప్రకటించాయి. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో భారత సహాయం పొందిన ఓ దేశం మాత్రం పాక్ కు సహకరించింది. తాజాగా ఆ ప్రతిఫలం అనుభవించిన విషయం తెరపైకి వచ్చింది. అవును... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వేళ టర్కీ, అజర్ బైజన్ దేశాలు పాకిస్థాన్ కు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో.. ఆ దేశాల పర్యాటక రంగంపై గట్టిగా ప్రతికూల ప్రభావం పడింది. ఇందులో భాగంగా... భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్లే పర్యటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన తాజా గణాంకాలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.




వివరాళ్లోకి వెళ్తే... కొన్నేళ్ల నుంచి అటు టర్కీ, ఇటు అజర్ బైజన్ దేశాలు భారత్ లో భారీ ప్రచారం చేసి పర్యటకులను పెద్ద ఎత్తున ఆకర్షించాయి. దీంతో పెద్ద సంఖ్యలో భారతీయులు అక్కడికి వెళ్లడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆ దేశాల ప్రభుత్వ టూరిజం బోర్డులు భారత మార్కెట్ ను కీలకంగా గుర్తించాయి. ఈ క్రమంలో... ఈ క్రమంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.

ఆ కీలక సమయంలో టర్కీ, అజర్ బైజన్ లు బహిరంగంగానే పాకిస్థాన్ కు మద్దతు తెలిపాయి. దీంతో.. మే నెల నుంచే ఈ రెండు దేశాలకు బుకింగ్స్ ను పర్యటకులు రద్దు చేసుకున్నారు. ఈ సమయంలో... భారత్ కు చెందిన ట్రావెల్ సర్వీస్ ప్రొవైడర్లు కూడా ఈ దేశాలకు బుకింగ్స్ ను నిలిపేసి నిరసన వ్యక్తం చేశారు. అవసరమైతేనే ఆ దేశాలకు ప్రయాణం చేయాలని పర్యటకులకు బుక్కింగ్ సంస్థలు సూచనలు కూడా చేశాయి. దీంతో... అప్పటి వరకూ అజర్ బైజన్ కు వెళ్లే భారతీయుల సంఖ్య ఏటా 33 శాతం వృద్ధి చెందుతూ రాగా.. మే నెల తర్వాత తర్వాత నాలుగు నెలల్లో ఒక్కసారిగా 56 శాతం పతనమైంది. సాధారణంగా ఆ నాలుగు నెలల్లో లక్ష వరకు ఉండాల్సిన పర్యటకుల సంఖ్య 44 వేలకు పడిపోయింది. ఆపరేషన్ సిందూర్ కు ముందు నాలుగు నెలల్లో ఆ దేశానికి 81 వేల మంది భారతీయులు వెళ్లారు.

ఇక టర్కీ విషయానికొస్తే... మే నుంచి ఆగస్టు వరకు టర్కీకి వెళ్లే భారతీయుల సంఖ్య మూడో వంతు తగ్గింది. ఈ సీజన్ లో గతేడాది 1.36లక్షల మంది ఆ దేశాన్ని సందర్శించగా.. ఈ సారి ఆ సంఖ్య 90,400కు పరిమితమైంది. ముందు ముందు ఈ ప్రభావం మరింతగా ఉండొచ్చని అంటున్నారు.

**'దోస్తే' మేలు మరిచిన టర్కీ!:**

2023 ఫిబ్రవరి 6న భూకంపవల్ల సిరియాతో పాటు టర్కీ అతలాకుతలం అయ్యింది. ఈ సమయంలో ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ముందుగా భారత్ స్పందించింది. టర్కీకి ఆపన్న హస్తం అందించింది. ఆ సమయంలో టర్కీకి భారత ప్రధాని మోడీ సంఘీభావం తెలిపారు. టర్కీ ప్రజలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని చెబుతూ.. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అనంతరం... టర్కీకి సహాయం చేయడానికి భారత్ "ఆపరేషన్ దోస్త్"ను ప్రారంభించింది. ఈ సమయంలో... టర్కీకి తక్షణం సహాయ చర్యలు ఏమి అందించాలనే విషయాన్ని నిర్ణయించడానికి ప్రధాని మోడీ సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమయంలో 8,45,590 డాలర్ల సహాయ సామాగ్రిని పంపించారు. ఈ సందర్భంగా స్పందించిన టర్కీ రాయబారి ఫిరత్ సునేల్... భారత్ కు కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో నిలబడిన స్నేహితుడే నిజంగా స్నేహితుడని చెప్పుకొచ్చాడు. ఢిల్లీకి ధన్యవాదాలు తెలిపారు. కట్ చేస్తే... ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కు మద్దతు తెలిపి భారత్ కు వెన్నుపోటు పొడిచే పనికి పూనుకుంది. ఇప్పుడు అనుభవిస్తుంది!

# కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో సినిమా ట్విస్టు.. నిందితుడు అరెస్టుపై భిన్న కథనాలు!






**హైదరాబాద్  పెన్ పవర్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన నిజామాబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో ట్విస్టు చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం కానిస్టేబుల్ హత్యకు గురికాగా, నిందితుడు రియాజ్ ను అరెస్టు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. సుమారు 8 ప్రత్యేక పోలీసు బృందాలు పెద్ద ఎత్తున గాలింపు చేపట్టి ఆదివారం మధ్యాహ్నం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే పోలీసుల నుంచి నిందితుడు తప్పించుకునే ప్రయత్నంలో ఎన్ కౌంటర్ జరిగినట్లు కథనాలు వెలువడ్డాయి. నిందితుడు రియాజ్ ప్రాణాలు కోల్పోయాడని కొందరు చెబుతుండగా, నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆ కథనాలను ఖండించారు. కానిస్టేబుల్ ప్రమోద్ హత్య తర్వాత తప్పించుకుని పారిపోయిన నిందితుడు రియాజ్.. సారంగపూర్ అనే గ్రామ శివార్లలో ఓ పాడైపోయిన లారీ క్యాబిన్ లో తలదాచుకున్నట్లు పోలీసులకు సమాచారం అందిందని, వెంటనే అతడిని పట్టుకుని వెళ్లేందుకు పోలీసులు వెళ్లగా, అక్కడ మరో కానిస్టేబుల్ పై నిందితుడు రియాజ్ దాడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రియాజ్ ను ఎన్ కౌంటర్ చేశారని తొలుత ప్రచారం జరుగగా, అటువంటిదేమీ లేదని సీపీ సాయిచైతన్య స్పష్టం చేస్తున్నారు. అయితే రియాజ్ గాయపడ్డాడని, అతడిని ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారని మీడియా కథనాలు తెలియజేస్తున్నాయి. దీంతో నిజామాబాద్ పోలీసు కానిస్టేబుల్ హత్యోదంతంలో సినిమా ట్విస్టులు చోటుచేసుకుంటున్నట్లు చెబుతున్నారు. నిందితుడు రియాజుకు సుదీర్ఘ నేర చరిత్ర ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. గత మూడేళ్లలో సుమారు 40 కేసులు అతడిపై నమోదయ్యాయని సమాచారం. ఖరీదైన బైకులు, బుల్లెట్ దొంగతనాల్లో ఆరితేరిపోయిన నిందితుడు రియాజ్ నిజామాబాద్ వచ్చినట్లు తెలుసుకున్న కానిస్టేబుల్ రియాజ్ అతడిని పట్టుకునేందుకు వెళ్లగా, రియాజ్ తప్పించుకునే ప్రయత్నంలో కాలువలో దూకేశాడు. అయితే కానిస్టేబుల్ ప్రమోద్ తన మేనల్లుడు ఆకాశ్ తో కలిసి నిందితుడు రియాజ్ ను పట్టుకున్నాడు. ఆ వెంటనే ఎస్సై విఠల్ కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు.

ఇక నిందితుడుని పోలీసుస్టేషన్ కి తరలించే క్రమంలో కానిస్టేబుల్ ప్రమోద్ ద్విచక్రవాహనంపై రియాజ్ ను మధ్యలో కూర్చొబెట్టుకుని వెళుతుండగా, మార్గమధ్యలో కత్తితో కానిస్టేబుల్ గుండెలో పొడిచి హతమార్చాడు. ఈ హత్య రాష్ట్రంలో సంచలనం సృష్టించగా, డీజీపీ శివధర్ రెడ్డి తీవ్రంగా పరిగణించారు. నిందితుడి అరెస్టుకు ఆదేశాలు జారీ చేశారు. కానిస్టేబుల్ పై దాడి చేసి అక్కడి నుంచి పరారైన రియాజ్ కోసం పోలీసులు 48 గంటలుగా తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ మధ్యాహ్నం అతడి ఆచూకీపై సమాచారం అందడంతో పట్టుకున్నారని అంటున్నారు. అయితే ఈ క్రమంలో అతడు గాయపడటం, ఆస్పత్రికి తరలించడం కలకలం సృష్టించింది. నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారని తొలుత వార్తలు ప్రసారం కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే నిందితుడు ప్రాణాలతోనే ఉన్నాడని కమిషనర్ సాయిచైతన్య వెల్లడించారు. కానీ, నిందితుడు ఆస్పత్రిలో ఉండటంతో ఏం జరిగిందనే చర్చ జరుగుతోంది.

# కెప్టెన్‌గా తొలి వన్డేలోనే ఓటమి... స్పందించిన గిల్

- ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఓటమి
- కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు నిరాశతో ఆరంభం
- వర్షం కారణంగా మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదింపు
- ఓడినా జట్టు పోరాట పటిమపై గిల్ ప్రశంసలు
- పవర్‌ప్లేలో వికెట్లు కోల్పోవడమే ఓటమికి కారణమన్న కెప్టెన్
- సిరీస్ సమం చేసేందుకు అడిలైడ్‌లో రెండో వన్డే



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఓటమి పాలైనప్పటికీ, భారత జట్టు ప్రదర్శించిన పోరాట పటిమపై కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వన్డే కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే ఓటమి ఎదురైనా, జట్టులోని సానుకూల అంశాలను ప్రస్తావించాడు. ఓటమి నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నామని, సిరీస్‌లో పుంజుకుంటామని ధీమా వ్యక్తం చేశాడు.ఆదివారం పెర్త్‌లో వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 130 పరుగుల స్వల్ప స్కోరుకే పరిమితమైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ (46 నాటౌట్), జోష్ ఫిలిప్ (37), మాథ్యూ రెన్‌షా (21 నాటౌట్) రాణించడంతో 21.1 ఓవర్లలోనే 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ, "పవర్‌ప్లేలోనే మూడు కీలక వికెట్లు కోల్పోతే మ్యాచ్‌లో ఎప్పుడూ వెనుకబడే ఉంటాం. మా విషయంలో అదే జరిగింది. అయితే 130 పరుగుల తక్కువ స్కోరును కాపాడుకుంటూ మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లగలిగాం. మా బౌలర్లు అద్భుతంగా పోరాడారు. ఈ విషయంలో మాకు చాలా సంతృప్తిగా ఉంది" అని వివరించాడు. ఈ ఓటమి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతామని తెలిపాడు.అలాగే, వర్షం పడుతున్నా స్టేడియానికి భారీ సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలిపిన అభిమానులకు గిల్ కృతజ్ఞతలు తెలిపాడు. అడిలైడ్‌లో జరిగే రెండో వన్డేలోనూ అభిమానులు ఇలాగే తమను ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఈ సిరీస్‌ను సమం చేయాలంటే తదుపరి మ్యాచ్‌లో టాపార్డర్ బ్యాటర్లు రాణించడం కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే అక్టోబర్ 23న అడిలైడ్‌లో జరగనుంది.

# ట్రై సిరీస్ నుంచి తప్పుకున్న రషీద్ ఖాన్ సేన.. ఆఫ్ఘనిస్తాన్ స్థానంలో జింబాబ్వే




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ వైమానిక దాడి కారణంగా ఆఫ్ఘనిస్తాన్ ట్రై-సిరీస్ నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్ తప్పుకున్న ఈ సిరీస్ యధావిధిగా జరగనుంది. ఆఫ్ఘనిస్తాన్ స్థానంలో జింబాబ్వే ఈ ట్రై సిరీస్ ఆడనుంది. ఈ విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు శనివారం (అక్టోబర్ 18) కన్ఫర్మ్ చేసింది. టీ20 ఫార్మాట్ లో నవంబర్ 17 నుండి 29 వరకు జరగనున్న ఈ ట్రై సిరీస్ లో పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే ఆడనున్నాయి. "ఆఫ్ఘనిస్తాన్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి తమ అసమర్థతను వ్యక్తం చేసింది. నవంబర్ 17 నుండి 29 వరకు రావల్పిండి, లాహెూర్ వేదికలుగా జరగనున్న ఈ సిరీస్ కు జింబాబ్వే క్రికెట్ అంగీకరించింది". అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. పాకిస్తాన్ ఏరియల్ స్ట్రైక్ లో ముగ్గురు లోకల్ క్రికెటర్లతో పాటు ఐదు మంది పౌరులు చనిపోయిన విషయం తెలిసిందే. బోర్డర్ లో పక్టిక ప్రావిన్స్ సమీపంలో జరిగిన ఈ దాడిలో కబీర్, సిగ్బతుల్లా, హరూన్ అనే క్రికెటర్లు షరానా లో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి వస్తుండగా దాడి జరిగింది. పాక్ దాడిపై పిరికిపంద చర్యగా ఆగ్రహించిన రషీద్ ఖాన్.. లేటెస్టుగా లాహెూర్ ఖాలందర్స్ ను బయో నుంచి డిలీట్ చేయడం.. పీఎస్ఎల్ ను బాయ్ కాట్ చేస్తున్నాడనే రూమర్స్ కు కారణమయ్యింది. ఇప్పటికే ట్రై సీరీస్ ను రద్దు చేస్తున్నట్లు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. అయితే సీరీస్ యదావిధిగా కొనసాగుతుందని పాక్ క్రికెట్ బోర్డు అనౌన్స్ చేసింది.ముగ్గురు ఆఫ్ఘాన్ క్రికెటర్ల మృతి పాకిస్తాన్-ఆఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య మరింత ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరు దేశాల సైన్యాలు ఒకవైపు పోరాడుతుంటే.. ఇప్పుడు క్రికెట్ పైన కూడా యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. తమ దేశ ఆటగాళ్ల మృతిపై ఆఫ్ఘాన్ క్రికెటర్లు సీరియస్ గా ఉన్నారు. అయితే కెప్టెన్న రషీద్ ఖాన్ ఈ అంశంపై తీవ్రంగా స్పందించాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్ ను బాయ్ కాట్ చేయనున్నట్లు వస్తున్న వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

# తొలి వన్డేలో టీమిండియా ఓటమి... డీఎల్ఎస్ విధానంలో ఆసీస్ విన్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆస్ట్రేలియా పర్యటనను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు 7 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) భారత్‌పై ఘన విజయం సాధించింది. కంగారూ బౌలర్ల విజృంభణకు తోడు కెప్టెన్ మిచెల్ మార్ష్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో రాణించడంతో ఆసీస్ సునాయాసంగా గెలుపొందింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యంలో నిలిచింది.వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. ఆ జట్టు నిర్ణయం సరైనదేనని నిరూపిస్తూ పేసర్లు మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ ఆరంభం నుంచే భారత బ్యాటర్లపై విరుచుకుపడ్డారు. వారి ధాటికి రోహిత్ శర్మ (8), విరాట్ కోహ్లీ (0), శుభ్‌మన్ గిల్ (10) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. దీంతో 9 ఓవర్లలోపే భారత్ 25 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. శ్రేయస్ అయ్యర్ (11) కూడా నిరాశపరిచాడు.ఈ దశలో కేఎల్ రాహుల్ (38), అక్షర్ పటేల్ (31) కాసేపు ప్రతిఘటించారు. వీరిద్దరూ ఆచితూచి ఆడుతూ జట్టు స్కోరును గాడిన పెట్టే ప్రయత్నం చేశారు. అయితే కీలక సమయంలో వీరిద్దరూ ఔటయ్యారు. చివర్లో తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (11 బంతుల్లో 19 నాటౌట్) రెండు భారీ సిక్సర్లతో మెరవడంతో, వర్షం కారణంగా 26 ఓవర్లకు కుదించిన ఇన్నింగ్స్‌లో భారత్ 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేయగలిగింది. ఆసీస్ బౌలర్లలో హేజిల్‌వుడ్, మిచెల్ ఓవెన్, కునెమాన్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

అనంతరం డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆస్ట్రేలియా లక్ష్యాన్ని 131 పరుగులుగా నిర్దేశించారు. ఈ లక్ష్య ఛేదనలో ఆసీస్‌కు శుభారంభం దక్కకపోయినా, కెప్టెన్ మిచెల్ మార్ష్ (52 బంతుల్లో 46 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి జోష్ ఫిలిప్పే (37) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఆసీస్ విజయం ఖాయమైంది. చివరి వరకు క్రీజులో నిలిచిన మార్ష్, రెన్‌షా (21 నాటౌట్)తో కలిసి మరో 29 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు విజయాన్ని అందించాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ తీశారు. ఇరు జట్ల మధ్య రెండ్ వన్డే అక్టోబరు 23న అడిలైడ్ లో జరగనుంది.

# నాని- సుజీత్ మూవీ మొత్తం అక్కడే.. రిలీజ్ ఎప్పుడంటే?



భాగ్యశ్రీ బోర్స్ ఫ్యాషన్ ఎల్లప్పుడూ ట్రెండ్‌సెట్‌గా ఉంటుంది



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని, యంగ్ డైరెక్టర్ సుజీత్ కాంబినేషన్ లో ఓ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. రీసెంట్ గా పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. నిజానికి సుజీత్ తన చివరి మూవీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ కన్నా ముందే నాని సినిమాను ప్రకటించారు. ఆ తర్వాత ఏడాది దాటినా ఒక్క అప్డేట్ ఇవ్వలేదు.దీంతో సినిమా రద్దు అయిందని అనేక రూమర్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని ఓజీ ప్రమోషన్స్ లో సుజీత్ ఖండించారు. నానితో తాను మూవీ చేస్తున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఆ సినిమాకు సంబంధించి పలు విషయాలు కూడా పంచుకున్నారు. రీసెంట్ గా దసరా పండుగ సందర్భంగా సినిమాను లాంఛనంగా ప్రారంభించారు.హైదరాబాద్ లో అక్టోబర్ 3వ తేదీన పూజా కార్యక్రమాలు జరగ్గా.. వేడుకకు సీనియర్ హీరో వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. మూవీ టీమ్ కు శుభాకాంక్షలు తెలిపారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని అప్పుడు మేకర్స్ తెలిపారు. మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నామని చెప్పారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో సినిమాకు సంబంధించిన కీలక అప్డేట్ వైరల్ గా మారింది. సినిమా కోసం 70 రోజుల షూటింగ్ షెడ్యూళ్లను మేకర్స్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. మూవీకి సంబంధించిన మేజర్ పోర్షన్ ఫారిన్ లోనే జరగనుందని సమాచారం. ఇప్పటికే పలు దేశాల్లో లొకేషన్స్ కూడా సెట్ చేసుకున్నట్లు వినికిడి.వచ్చే ఏడాది దసరా కానుకగా సినిమాను రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే షూటింగ్ కాస్త లేట్ అయితే.. 2026 డిసెంబర్ లో విడుదల అవ్వనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సినిమా.. సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం కాదని సమాచారం. ఇంతకు ముందు కూడా అదే విషయాన్ని స్పష్టం చేశారు సుజీత్.తన డెబ్యూ మూవీ రన్ రాజా రన్ లో నాని మూవీ ఉంటుందని చెప్పారు. డార్క్ కామెడీకి కాస్త యాక్షన్ జోడించి చేస్తున్నట్లు మరో ఇంటర్వ్యూలో తెలిపారు. కొత్త మోడల్ కథ అని పేర్కొన్నారు. అయితే నాని- సుజీత్ మూవీకి బ్లడీ రోమియో అనే టైటిల్ ను ఫిక్స్ చేసినట్లు సినీ వర్గాల్లో కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇంకా అధికారిక ప్రకటన రాకపోయినా.. అదే ఫిక్స్ అని టాక్.



శ్రీలీల ఫ్యాషన్ అనేది స్టైల్‌కి కొత్త నిర్వచనం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com